**రిపోర్టర్లు కావలెను**

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న **'జర్నలిస్ట్ ఫైల్'** దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం :
9502535152, 7416812467



శుక్రవారం 31.05.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -129 www.journalistfile.com పేజీలు 6 వెల : రూ.5.00




# చంపేస్తున్నారు!

- ప్రాణాలు తీస్తున్న కలుషిత జలాలు
- మురికి కాల్వల్లో పైప్‌లైన్లు
- తప్పు పట్టి.. పగిలిపోయి..కలుషితం
- రంగు మారిన నీరు వస్తోందని మొత్తుకుంటున్నా పట్టించుకోని అధికారులు
- కలుషిత నీటితో మృత్యువాత పడుతున్న ప్రజలు
- వాంతులు విరోచనలతో ఆస్పత్రుల పాలవుతున్న వందలాది మంది

విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఆంధ్రప్రదేశ్‌లో కలుషిత జలాలు ప్రాణాలు ఉసురు తీస్తున్నాయి. మురికి కాల్వల్లో వేసిన పైప్‌లైన్లు.. తప్పు పట్టి.. పగిలిపోయి..కలుషితమవుతున్నాయి. ఈ నీటిని తాగిన ప్రజలు వాంతులు, విరేచనాలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మొన్న గుంటూరు, నేడు విజయవాడలో నిండు ప్రాణాలు బలయ్యాయి. ఫిబ్రవరిలో కలుషిత నీరు తాగి గుంటూరులో ముగ్గురు చనిపోగా 200 మందికిపైగా ఆసుపత్రిపాలయ్యారు. అధికారులు అలసత్వం వీడకపోవడంతో ఇప్పుడు విజయవాడ మొగల్రాజపురం లో కలుషిత జలాలు తాగి నలుగురు బలయ్యారు. వందలాదిమంది వాంతులు, విరేచనాలతో హాస్పిటల్‌లో చేరారు. బెజవాడలో కొన్నాళ్లుగా రంగు మారిన నీరు వస్తోందని ప్రజలు మొత్తుకుంటున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. మొగల్రాజపురంలో నల్లని నీరు వస్తుందని చెప్పినా తుప్పుపట్టిన పైపులైన్లు మార్చలేదు. కలుషిత నీరు తాగడం వల్లే తన తండ్రి చనిపోయాడని మృతుడి కుమారుడు వాపోయాడు. సమీపంలోని హాస్పిటల్‌కు తీసుకెళ్తే పెద్దాస్పత్రికి తీసుకెళ్లమని చెప్పారని కనీసం అంబులెన్స్‌కి ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదని కన్నీళ్లపర్యంతమయ్యాడు.

బాధితుల సంఖ్య పెరగడంతో అధికారులు అలర్టయ్యారు. ఇంటింటికి వెళ్లి నీటిని సేకరించారు. తుప్పుపట్టిన పైప్‌లైన్ వాటర్‌ను ల్యాబ్‌కు పంపించారు. ఇవాళ సాయంత్రానికి పూర్తిస్థాయి నివేదికను అందిస్తామని చెబుతున్నారు. నలుగురు మృతికి కలుషిత నీరే కారణమా.. ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామంటున్నారు.

ఆస్వస్థతకు గురైన వారిపై ప్రత్యేక ఫోకస్ పెట్టామంటున్నారు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి. 30 పడకలతో తాత్కాలిక శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రజలెవరు ఆందోళన చెందాల్సిన అవసరం చెప్పారు.

దశాబ్దాల క్రితం వేసిన తాగునీటి పైపులైన్లు పూర్తిగా తుప్పుపట్టి శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఈ ఐదేళ్లలో కనీసం ఒక్కచోట మార్చలేదు. నీటి శుద్ధికేంద్రాల నుంచి వచ్చే నీటిని రిజర్వాయర్ల ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తుంటారు. వీటిలో నాచు, బురద చేరకుండా ఆరు నెలలకోసారైనా శుభ్రం చేయాలి. కానీ అలాంటిదేమి జరగడం లేదు. నల్లా కనెక్షన్లకు మీటర్లు బిగించడంపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై చూపడం లేదు. ఇప్పటికైనా పారిశుద్ధ్యపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టి తమ ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఈసీ అన్యాయంగా వ్యవహరిస్తుంది : సజ్జల



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఎన్నికల కౌంటింగ్ కు వైసీపీ పకడ్బందీగా సిద్ధమవుతుంది. కౌంటింగ్ రోజు అనుసరించాల్సిన విధానాలపై వరుస సమావేశాలను నిర్వహిస్తుంది. ఇవాళ జూమ్ లో కౌంటింగ్ రోజు అనుసరించలిసిన అంశాలపై 175 నియోజక వర్గల కౌంటింగ్ ఏజెంట్ల,కు పార్టీ నేతలకు వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. చంద్రబాబు అడ్డదారిలో పట్టు నిలుపుకోవాలి అనుకుంటున్నారు. ఈసీ, ఎన్డీయే కూటమి ఏ విధంగా అన్యాయంగా వ్యవహరిస్తుందో అందరికీ తెలుసు అన్నారు. ప్రజా తీర్పు వైసీపీకి అనుకుంలాగా ఉంది.. పోస్టల్ బ్యాలెట్ విషయంలో గందరగోళానికి గురి చేస్తున్నారు జాగ్రత్తగా చూడాలి అని సూచించారు. వైసీపీకి పడిన ప్రతి ఒక్కఓటు మన పార్టీకే చెందాలి.. చెల్లని ఓటు చెల్లదని గట్టిగా చెప్పాలి అని పేర్కొన్నారు. అవతల పార్టీలు నిబంధలను అతిక్రమిస్తే గట్టిగ నిలదీయాలన్నారు. ఖచ్చితంగా ప్రతి ఒక్కరు నియమాలను ఫాలో అవ్వాలి అని సజ్జల రామకృష్ణ రెడ్డి తెలిపారు.

అవసరం అయితే అవతల వాళ్ళని క్వశ్చన్ చేసి ఫిర్యాదు చేయాడానికి అయినా సిద్ధంగా ఉండాలి అని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణ రెడ్డి తెలిపారు. అన్ని అంశాలపై పూర్తి అవగాహనతో కౌంటింగ్ ఏజెంట్లు ఉండాలి.. తెలియని విషయాలు స్పష్టంగా తెలుసుకోవాలి.. ఇప్పటి వరకు ఎంత సీరియస్ గా ఉన్నామో.. కౌంటింగ్ రోజు అంత కన్నా సీరియస్ గా.. అలర్ట్ గా ఉండాలి అందరు.. అవతల ఏజెంట్స్ కానీ, అధికారులు కానీ నియమాలని అతిక్రమిస్తే జగన్ తరుపున గట్టిగా మాట్లాడండి.. కౌంటింగ్ అయ్యాక పోస్ట్ మార్టం చేసే విధంగా కాకుండా ముందే జాగ్రత్తగా ఉండండి అని సజ్జల వెల్లడించారు.

### నాకు పోస్టింగ్ ఇవ్వండి..

## ఏపీ సీఎస్‌ను కోరిన ఏబీ వెంకటేశ్వరరావు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని సీనియర్ పోలీసు అధికారి ఏబీ వెంకటేశ్వర రావు గురువారం కలిశారు. క్యాట్ ఉత్తర్వుల ప్రకారం ఏబీ వెంకటేశ్వర రావుకి పోస్టింగ్ ఇచ్చి, జీత భత్యాలను ప్రభుత్వం చెల్లించాలని ధర్మాసనం ఆదేశించింది. ఏబీ వెంకటేశ్వరరావు శుక్రవారం పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఆయనకు పోస్టింగ్ ఇవ్వాలని పెద్ద ఎత్తున నెటిజన్లు కూడా డిమాండ్ చేస్తున్నారు. దాంతో హైకోర్టు తీర్పు కాపీని, క్యాట్ ఉత్తర్వులను పరిశీలించి తనకు వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని ఏబీ వెంకటేశ్వరరావు సీఎస్‌ను కోరారు. తాను ఈ విషయాన్ని పరిశీలిస్తానని సీఎస్ జవహర్ రెడ్డి ఏబీ వెంకటేశ్వరరావుకి తెలిపారు.

కాగా.. ఏబీ వెంకటేశ్వరరావుకి (గురువారం) ఉదయం ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్) ఉత్తర్వులను సస్పెండ్ చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఏబీవీ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఇటీవల క్యాట్ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ అంశంపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. క్యాట్ ఉత్తర్వులను సస్పెండ్ చేసేందుకు నిరాకరిస్తూ ప్రభుత్వ అప్పీల్‌ను కొట్టివేసింది.

**ఏబీ వెంకటేశ్వరరావుకు హైకోర్టులో ఊరట**

సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు కు హైకోర్టులో ఊరట లభించింది. కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్) ఉత్తర్వులను సస్పెండ్ చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఏబీవీ సస్పెన్షన్ ను ఎత్తివేస్తూ ఇటీవల క్యాట్ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను నిలుపుదల చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. క్యాట్ ఉత్తర్వులను సస్పెండ్ చేసేందుకు నిరాకరిస్తూ ప్రభుత్వ అప్పీల్ను కొట్టివేసింది.

రక్షణ పరికరాల కొనుగోలు వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో వైకాపా ప్రభుత్వం ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఆయన క్యాట్ ను ఆశ్రయించగా.. సస్పెన్షను సమర్థించింది. అనంతరం ఆయన హైకోర్టుకు వెళ్లగా.. ఉన్నత న్యాయస్థానం సస్పెన్షన్ ను కొట్టివేసింది. హైకోర్టు

2 లో

### పోస్టల్ బ్యాలెట్ల పై గందరగోళం...

## మెమో వెనక్కి తీసుకున్న ఈసీ




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** పోస్టల్ బ్యాలెట్‌పై అటెస్టేషన్ అధికారి సీల్ లేకపోయినా ఫర్వాలేదంటూ ఏపీ సీఈవో గతంలో ఇచ్చిన మెమోకు వ్యతిరేకంగా వైసీపీ ఏపీ హైకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఆ పార్టీ ఇవాళ ఏపీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్ విచారణలో ఉండగానే.. ఆ మెమోను కేంద్ర ఎన్నికల సంఘం వెనక్కి తీసుకుంది.

పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం చేసి, స్టాంప్ లేకపోయినా.. తన పేరు, డిజిగేషన్ పూర్తి వివరాలను చేతితో రాస్తే ఆమోదించాలని గతేడాది జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇవే మార్గదర్శకాలు

2 లో

## అధికారులను మార్చాలంటూ హైకోర్టులో పిన్నెల్లి పిటిషన్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీ హైకోర్టులో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సందర్భంగా తనపై నమోదైన కేసుల్లో విచారణ అధికారులను మార్చాలంటూ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఐజీ సహా కొందరు పోలీస్ అధికారులు తమను టార్గెట్ చేసి ఏకపక్షంగా వ్యవహరించారని పిటిషన్ లో పేర్కొన్నారు. కాగా, మాచర్లలో అల్లర్ల తర్వాత వైసీపీ క్యాడర్ పైనే కేసులు పెట్టారు తప్ప మా ఫిర్యాదులు పట్టించుకోవటం లేదని పిన్నెల్లి పిటిషన్ లో ప్రస్తావించారు. ఇక, ఈ నెల 13, 14 తేదీల్లో అల్లర్లు జరిగితే 23వ తేదీన బెయిల్ వచ్చాక దొంగ రికార్డులతో కోర్టులో పోలీసులు దొరికారని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లంచ్ మోషన్ పిటిషన్ లో తెలిపారు. సదరు అధికారులపై చర్యలు తీసుకుని విచారణ అధికారులుగా వేరే వారిని నియమించాలని ఆయన కోరారు.

విచారణకు అనుమతించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు.. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత విచారణ చేయనున్నట్లు పేర్కొనింది. కాగా, మాచర్లలో జరిగిన అల్లర్లపై ఇప్పటికే ఏపీ హైకోర్టు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మూడు కేసుల్లో బెయిల్ ను మంజూరు చేసింది.



### అంబటి రాయుడు ఫ్యామిలీకి

## బెదిరింపు కాల్స్!.

**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్ ) :** ఇండియన్ మాజీ క్రికెటర్ అంబటిరాయుడు కుటుంబానికి చంపుతామని బెదిరింపు కాల్స్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని తన స్నేహితుడు సామ్ పాల్ సోషల్ మీడియా ఖాతా ద్వారా తెలియజేశాడు. ఏ ఆటలో అయినా గెలుపు ఓటములు సహజం. అలాగే ఐపీఎల్ లో కూడా కొన్ని సార్లు గెలిచినా.. మరికొన్ని సార్లు పరాజయం పాలు గాక తప్పదు. ఈ నేపధ్యంలోనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ టీం ఫ్యాన్స్ హద్దులు మీరి ప్రవర్తిస్తున్నారు. కోహ్లిని విమర్శిస్తే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇండియన్ స్టార్ క్రికెటర్ అంబటిరాయుడు కోహ్లిపై విమర్శలు చేసినందుకు గానూ కోహ్లి ఫ్యాన్స్ నుంచి అంబటిరాయుడు కుటుంబానికి బెదిరింపు కాల్స్ వచ్చినట్లు తెలుస్తోంది.

ఈ విషయంపై రాయుడు సామ్ పాల్ స్పందిస్తూ.. ఆరెంజ్ క్యాప్ గెలిచినంత మాత్రాన ఐపీఎల్ ట్రోఫీ దక్కించుకున్నట్టు కాదని రాయుడు చేసిన విమర్శలను జీర్ణించుకోలేని ఆర్సీబీ ఫ్యాన్స్.. అతని భార్యను, ఇద్దరు చిన్న పిల్లలను లైంగిక దాడి చేయడంతో పాటు చంపేస్తామని బెదిరింపులకు దిగినట్లు తెలిపాడు. అలాగే కొందరు ఆర్సీబీ ఫ్యాన్స్ రెచ్చిపోయి రాయుడు కుటుంబంపై దాడికి యత్నిస్తున్నారని, అతని భార్య, కూతుళ్లను లక్ష్యంగా చేసుకొని చంపేస్తామని అంటున్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో పోలీసులు, న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకొని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇన్స్టాగ్రామ్ ఖాతాలో రాసుకొచ్చాడు.

# నాకు పోస్టింగ్ ఇవ్వండి..

## ఏపీ సీఎస్‌ను కోరిన ఏబీ వెంకటేశ్వరరావు

(మొదటి పేజీ తరువాయి)

తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. సర్వీసులో ఉన్న అధికారిని రెండేళ్ల కంటే ఎక్కువ కాలం సస్పెన్షన్లో ఉంచొద్దని ఆదేశిస్తూ.. ఏబీ వెంకటేశ్వరరావుపై ఉన్న సస్పెన్షన్ ను రద్దు చేసింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల కనుగుణంగా ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆ తర్వాత కొద్ది రోజులకే గతంలో ఏ కారణంతో సస్పెండ్ చేశారో.. తిరిగి అదే కారణంతో మరోసారి ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

ఒకే కారణంతో ప్రభుత్వం తనను రెండుసార్లు సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఏబీ వెంకటేశ్వరరావు క్యాట్ ను ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ జరిపిన క్యాట్.. ఆయన సస్పెన్షన్ ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఏబీవీకి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని.. సస్పెన్షన్ కాలానికి జీతభత్యాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. క్యాట్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. క్యాట్ ఉత్తర్వులను సస్పెండ్ చేసేందుకు నిరాకరించింది.

# పోస్టల్ బ్యాలెట్ల పై గందరగోళం...

## మెమో వెనక్కి తీసుకున్న ఈసీ

(మొదటి పేజీ తరువాయి)

అమలవుతున్నాయి. కానీ రాష్ట్రంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎంకే మీనా జారీ చేసిన ఉత్తర్వులు జారీ చేయడంతో వైసీపీ కోర్టును ఆశ్రయించింది. ఇప్పుడీ మెమోను వెనక్కి తీసుకుంటున్నట్టు ఈసీ హైకోర్టుకు తెలిపిన నేపథ్యంలో, జూన్ 4న కౌంటింగ్‌లో పోస్టల్ బ్యాలెట్లను ఏ విధంగా లెక్కిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

**పోస్టల్ బ్యాలెట్ లపై స్పష్టత ఇచ్చిన ఈసీ**

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలు మరో నాలుగు రోజులు మాత్రమే ఉన్నాయ్. ఈ పరిస్థితుల్లో అధికార వైసీపీకి ఎన్నికల కమిషన్ ఊహించని ఝలక్ ఇచ్చింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై వైసీపీ కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అటు హైకోర్టు..ఇటు ఎన్నికల కమిషన్‌ను వైసీపీ నేతలు సంప్రదించారు. అయితే ఈసీ మాత్రం వైసీపీ లేవనెత్తిన విషయాలపై సూటిగా రిప్లయ్ ఇచ్చింది. డిక్లరేషన్‌పై గెజిటెడ్ అధికారి సంతకం మాత్రమే ఉండి.. సీల్, హోదా లేకపోయినా ఆ ఓటు చెల్లుతుందని ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా తేల్చి చెప్పేసింది. దీంతో వైసీపీకి పెద్ద ఎదురుదెబ్బే తగిలినట్టయ్యింది.

హైకోర్టుకు..

ఎన్నికల కౌంటింగ్ సమయంలో రిటర్నింగ్ అధికారి ఇటువంటి పోస్టల్ బల్లెట్లను వ్యాలిడ్ చేయాలని క్లియర్ కట్‌గా ఈసీ ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు కొద్దిసేపటి క్రితం రాష్ట్ర సీఈఓ ముఖేష్ కుమార్ మీనాకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్ లేఖ రాయడం జరిగింది. ఈ అంశంలో సీఈఓ ఇచ్చిన మెమోపై హైకోర్టులో గురువారం వైసీపీ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది.

# రాజధాని ప్రాంతం నుంచి నిర్మాణ సామగ్రి తరలింపు.. అడ్డుకున్న సీఆర్డీఏ



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాజధాని ప్రాంతం నుంచి నిర్మాణ సామగ్రి తరలింపు వ్యవహారంపై ఎట్టకేలకు సీఆర్డీఏ స్పందించింది. గురువారం అమరావతి నుంచి తరలిస్తున్న సామగ్రిని సీఆర్డీఏ అధికారులు అడ్డుకున్నారు. అమరావతిలోని తాళ్లాయిపాలెం గ్రామంలో ఎల్ అండ్ టీ సంస్థకు చెందిన యార్డ్ నుంచి భూగర్భ విద్యుత్తు కేబుళ్లకు అమర్చేందుకు ఉపయోగించే ప్లాస్టిక్ స్పేసర్లను తరలిస్తుండగా అడ్డుకున్నారు. ఎల్ అండ్ టీ స్టాక్ యార్డులో సీఆర్డీఏ ఇంజినీరింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అయితే, ప్లాస్టిక్ స్పేసర్లకు సీఆర్డీఏ ఎలాంటి బిల్లులు చెల్లించలేదని అధికారులు స్పష్టం చేశారు.

ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సామగ్రిని తరలించడం పట్ల సంబంధిత కాంట్రాక్టు సంస్థకు నోటీసులు జారీ చేసినట్టు సీఆర్డీఏ తెలిపింది. ఇకపై అమరావతి ప్రాంతంలో నిర్మాణాలకు ఉద్దేశించిన సామగ్రి తరలింపునకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని కాంట్రాక్టరు సంస్థలకు సీఆర్డీఏ స్పష్టం చేసింది. రాజధాని అమరావతిలో గత కొన్ని రోజులుగా విద్యుత్తు తీగల బండిళ్ల తరలింపు కొనసాగింది. మంగళవారం ఓ ప్రైవేటు ట్రాన్స్పోర్ట్ కంపెనీ 8 బండిళ్లను 4 కంటెయినర్లలో విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురానికి తీసుకెళ్లింది. ఎన్నికల ఫలితాలు రావడానికి కొద్ది రోజుల ముందు రాజధాని సామగ్రిని తరలించడం దారుణమని రాజధాని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనిదినాలను 200 రోజులకు పెంచాలి.



**క్రోసూరు ( జర్నలిస్ట్ ఫైల్ ):** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పని దినాలను 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి. రవిబాబు అన్నారు. ఈరోజు మండలంలోని 88 తాళ్లూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ వర్షాబావ పరిస్థితులలో ఈ పథకం కింద కల్పిస్తున్న 100 రోజులు ముగ్గురు సభ్యులు ఉన్న కుటుంబంలో నెలరోజులకి పూర్తవుతాయని అన్నారు. వ్యవసాయ పనులు లేని రోజులలో పెరిగిన కుటుంబ ఖర్చులకు తగిన ఆదాయం రావాలి అంటే 200 రోజులకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇస్తున్న కూలిని కూడా 500 రూపాయలకు పెంచాలని,మెట్ల వ్యవస్థను కొనసాగించి వారికి ప్రత్యేకమైన అలవెన్స్ ఇవ్వాలని, అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలెన్సు, మజ్జిగ, మంచి నీళ్లకు ప్రత్యేకమైన అలవెన్సులు ఇవ్వాలని ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని వీటిని సాధించడానికి సంఘం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని తెలిపారు. అటువంటి సంఘాన్ని బలపర్చుకోవటానికి కూలీలంతా ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఏపూరి వెంకటేశ్వర్లు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# అలర్లకు పాల్పడితే... లోపలేస్తాం : ఎన్నికల ప్రధాన అధికారి మీనా




**మచిలీపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** కౌంటింగ్ కేంద్రంలో అలజడులు సృష్టిస్తే అరెస్టు చేసి జైలుకు పంపుతామని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయంలో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ లను ఆయన పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

జిల్లా ఎన్నికల అధికారి బాలాజీ ఇతర అధికారులకు కొన్ని సూచనలు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో ఎవరైనా అలజడులు సృష్టిస్తే ఎన్నికల సంఘం ఎవరినీ ఉపేక్షించేది లేదని, అట్టి వారినీ అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎటువంటి విజయోత్సవాలకు అవకాశం లేదన్నారు. పోస్టల్ బ్యాలెట్ పైవైసీపీ పార్టీ ఫిర్యాదును కేంద్ర ఎన్నికల కమిషన్ కు తెలిపామని, దానిపై ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉందన్నారు.

**కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన ఎన్నికల ప్రధాన అధికారి**

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో ఓట్ల లెక్కింపు కేంద్రమైన కృష్ణ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. వారు తొలుత జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా పోలీస్ అధికారి అద్నాన్ నయీమ్ అస్మి, సంయుక్త కలెక్టర్ గన్నవరం రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మలతో కలిసి విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అకాడమిక్ భవనంలోని మచిలీపట్నం, గుడివాడ, పెడన, పామర్రు, అవనిగడ్డ, గన్నవరం, పెనమలూరు శాసనసభ నియోజక వర్గాలు, మచిలీపట్నం పార్లమెంటు అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ హాళ్ళు, స్ట్రాంగ్ రూములు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు గదులు, అక్కడ ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన టేబుళ్ళు, కుర్చీలు, ఆర్వోలు, పరిశీలకుల టేబుళ్ళు, కౌంటింగ్ ఏజెంట్ల పరిశీలన కోసం ఇనుప కడ్డీలతో మెష్ ఏర్పాట్లు కుర్చీలు, ఈటీపీబిఎస్, ఎన్కోర్ కౌంటర్లు, కంపైలేషన్ విభాగాలు తదితర ఏర్పాట్లను పరిశీలించారు.

స్ట్రాంగ్ రూముల లాగ్ బుక్కులను తనిఖీ చేసి సీఈవో సంతకం చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు ఎలా జరుగుతుందో జిల్లా ఎన్నికల అధికారి సీఈఓకు వివరించారు. కేంద్రంలో నిరంతర విద్యుత్ అంతర్జాలం సరఫరా సజావుగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని సీఈవో సూచించారు. అనంతరం సీఈవో అకాడమిక్ భవనం ఎదురుగా నూతన భవనాల్లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ను పక్కనే స్ట్రాంగ్ రూముల పరిశీలన కోసం సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సీఈఓ వెంట డీఆర్ఓ చంద్రశేఖర రావు, మచిలీపట్నం, గుడివాడ, పెడన, పామర్రు, అవనిగడ్డ, పెనమలూరు రిటర్నింగ్ అధికారులు ఎం.వాణి, పి.పద్మావతి, పి.వెంకటరమణ, శ్రీదేవి, జి.బాలసుబ్రమణ్యం, డి.రాజు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి షాహిద్ బాబు, సర్వే ల్యాండ్ రికార్డుల ఏడి మనిషా త్రిపాఠి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# జీజీహెచ్ లో పిల్లలకు వంకర కాళ్ళను సరి చేసేందుకు ఉచిత శిబిరం




**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో జూన్ మూడో తేదీన ఆర్థోపెడిక్ ఓపి లో కోత, కుట్లు (ఆపరేషన్) లేకుండా చిన్న పిల్లలకు వంకర కాళ్ళను సరి చేసేందుకు ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు.

గురువారం ఆసుపత్రి ఆర్థోపెడిక్ ఓపి లో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్యూర్ ఇండియా సౌజన్యంతో వంకర కళ్ళను సరిచేసేందుకు ఉచిత వైద్య శిబిరం పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు.

జూన్ మూడో తేదీన ఆర్థోపెడిక్ ఓపి లో పిల్లలకు పుట్టగానే కాళ్లు వంకర్లు పోయిన వారికి ఆపరేషన్ లేకుండా వైద్యం చేసి సరి చేస్తారన్నారు. ఆ రోజు ఓపి కి వచ్చిన వారికీ కోత కుట్టు లేకుండా వంకర కాళ్ళను సరి చేస్తారని ఆయన చెప్పారు. క్యూర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో తిరిగి కాళ్ళు వంకరగా ఉన్న పిల్లలను గుర్తించి...

వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆర్థో విభాగానికి తీసుకుని వచ్చి.. వారికి వంకర పాదాలను సరి చేసే విధంగా కృషి చేస్తున్నారని సూపరింటెండెంట్ అభినందించారు.

పుట్టగానే చిన్నారులకు కాళ్ళు వంకరగా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని రావాలని అయన సూచించారు. వంకర పాదం తో పుట్టిన పిల్లలకు వెంటనే చికిత్స చేస్తే దివ్యంగులు కాకుండా ఉండగలరని అయన చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ యస్ యస్ వి రమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని పాల్గొన్నారు.

# సీఎస్ జవహర్ రెడ్డిపై మరోసారి సంచలన ఆరోపణలు చేసిన జనసేన నేత



**విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీ సీఎస్ జవహర్ రెడ్డిపై వరుసగా జనసేన నేత మూర్తి యాదవ్ సంచలన ఆరోపణలు చేస్తున్నారు. ఆయన చేస్తున్న ఆరోపణలపై సీఎస్ కార్యాలయం నోటీసులు కూడా పంపించింది. అయితే జనసేన నేత మూర్తి యాదవ్ ఏమాత్రం తగ్గకుండా సీఎస్‌పై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. గురువారం విశాఖలోని జనసేన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

**సీఎస్ బినామీలు భూములు అమ్ముతున్నారు...**

'నేను ఇదివరకు చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నాను. తర్లువాడలో భూములను జవహర్ రెడ్డి తన బినామీ పేరుతో కొట్టేశారు. మంత్రి మేరుగు నాగార్జున సీఎస్‌తో డ్యూయల్ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈసీ కాపీ రాకుండా రెవిన్యూ వెబ్‌సైట్ బ్లాక్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు జవహర్ రెడ్డి వ్యవహారాలను చోడురాజు, సత్య కృష్ణంరాజు చూసే వారు. జవహర్‌కి మరో బినామీ విశాఖలో పెరిచర్ల శ్రీనివాసరాజు. ఆయన ఎర్ర మట్టి దిబ్బలు దగ్గర వంద ఎకరాలు రాయించు కున్నారు. జవహర్ రెడ్డి బినామీలు సత్య కృష్ణంరాజు, శ్రీనివాసరాజులు విశాఖలో పలచోట్ల లే అవుట్ వేసి అమ్ముతున్నారు. వీటితో జవహర్ రెడ్డికి సంబంధం ఉందో లేదో చెప్పాలి" అని మూర్తి యాదవ్ సవాల్ విసిరారు.

**అప్పన్న స్వామి మీద ప్రమాణం చేద్దాం..**

"సీఎస్‌పై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తన పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలి. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో గాని సీబీఐతో గాని విచారణ జరిపించాలి. జవహర్ రెడ్డి డబ్బుల తోనే ఈ బినామీలు ఆస్తులను కొనుగో లు చేశారు. జవహర్ రెడ్డిపై నేను చేసిన ఆరోపణలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నాను. సీఎస్ జవహర్ రెడ్డికు దమ్మంటే సింహాచలం అప్పన్న స్వామి దగ్గర తనకు విశాఖ భూములతో ఎలాంటి సంబంధం లేదని ప్రమాణం చేయాలి. నేను చెప్పింది నిజమేనని... నేను నా కుటుంబ సభ్యులతో వచ్చి ప్రమాణం చేస్తాను" అని సీఎస్ జవహర్ రెడ్డికు జనసేన నేత మూర్తియాదవ్

# ఎన్నికల విధుల్లో ఉంటే బయోమెట్రిక్ ఏలా వేస్తారు? సచివాలయ ఉద్యోగుల ఆగ్రహం




**ఏలూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** జిల్లాలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషన్ల తీరుపై గ్రామ సచివాలయ ఉద్యోగులు భగ్గుమంటున్నారు. సరిపడా సంఖ్యలో ఉద్యోగులు లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులు బీఎల్వోలుగా విధులు నిర్వర్తించాలి, బీఎల్వోలు క్షేత్రస్థాయిలో ఎక్కువగా పర్యటించాలి, ప్రతిరోజూ ఉన్నతాధికారుల సమీక్షలకు హాజరు కావాలి,ఓటర్ల జాబితాలు స్పష్టీకరణ చేయాలి, ఇంటింటి సర్వే.. ఓటర్ స్లిప్పుల పంపిణీ చేయాలని వారు తెలిపారు. ఎన్నికల సమయంలో పలు శాఖల పరిధిలోకి వారి అవసరాల రీత్యా డిప్యూటేషన్ పై తీసుకున్నారని, ఇలాంటప్పుడు వీరంతా రోజూ గ్రామ, వార్డు సచివాలయానికి వచ్చి మూడు పూటలా బయోమెట్రిక్ వేయడం అసాధ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో బీఎల్వోలుగా విధులు నిర్వహించిన గ్రామ సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ అటెండెన్స్ వేయలేదన్న సాకుతో ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయటం, తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాల్సిందేనంటూ హెచ్చరికలు జారీ చేయడం పట్ల సచివాలయ ఉద్యోగుల ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 40 శాతం సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసారని వారు తెలిపారు.

ఎన్నికల విధుల్లో తలమునకలుగా ఉన్న సచివాలయ ఉద్యోగులకు ఇప్పుడు అ-టెండెన్స్ సాకుగా చూపి వారికి షోకాజు నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది. తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ ఉండాల్సిందేనని లేకుంటే జీతాలు నిలిపివేస్తామని వేధింపులు ఎక్కువ అయ్యాయని ఆందోళన చెందుతున్నారు. సచివాలయ ఉద్యోగులుగా చేరిన తరువాత జాబ్చార్ట్ ప్రకారం పనిచేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పనిచేయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జాబ్చార్డు అస్తవ్యస్తంగా మారిందని సచివాలయ ఉద్యోగులపై పెత్తనం చేస్తున్నారన్నారు. ఆయా ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పని చేయడం మానేసి సచివాలయ ఉద్యోగులపై భారం మోపుతున్నారని, తీవ్ర ఒత్తిళ్ళకు గురి కావాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు అప్పగించే పనులు చేస్తున్నప్పుడు జీతాలు ఎందుకు కట్ చేస్తారంటూ ఆవేదన చెందుతున్నారు.

# పోస్టల్ బ్యాలెట్ లపై పార్టీల రాద్ధాంతం సరికాదు




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** చిన్న చిన్న మానవ తప్పిదాలను సాకుగా చూపి ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లుబాటు కాకుండా చేయాలంటూ కొన్ని రాజకీయ పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. అమరావతిలో సురేష్ బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు యొక్క విలువను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆ ఓట్లు ద్వారానే రాజకీయ పార్టీలు అధికార పీఠాన్ని ఎక్కుతాయన్నారు. ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ లపై కొన్ని రాజకీయ పార్టీలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. పోస్టల్ బ్యాలెట్ లను తిరస్కరిస్తే ప్రజాస్వామ్యంలో ఉద్యోగుల ఓట్లకు విలువ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కవర్లు,అధికారుల సంతకాలు తదితర అంశాలను కాకుండా బ్యాలెట్ పేపర్ ను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని పోస్టల్ బ్యాలెట్ ల చెల్లుబాటు ను నిర్ణయించాలన్నారు. ఈవీఎం లతో పోలిస్తే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వేసే విధానం సంక్లిష్టమైన ప్రక్రియ అని సురేష్ బాబు గుర్తు చేశారు. పోస్టల్ బ్యాలెట్లు చెల్లకపోతే సంబంధింత బూత్ లలో విధులు నిర్వహించిన అధికారులే బాధ్యత వహించాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ లో ఎన్నికల సంఘం విధివిధానాలను అన్ని రాజకీయ పార్టీలు గౌరవించాలన్నారు.

# మాతా శిశు ఆరోగ్య పరిరక్షణలో బహుముఖ విధానం

- **వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు**



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** శిశు ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యంగా ప్రసూతి, శిశు మరణాల రేటును తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బహుముఖ విధానాన్ని అనుసరిస్తోందని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి కృష్ణబాబు అన్నారు. గురువారం విజయవాడలో ఓ హోటల్లో జరిగిన ఎంపిసిడిఎస్ఆర్ సమీక్షా సమావేశం, కన్సల్టేషన్ వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి డిఎంహెచ్వోలు, డిసిహెచ్ఎస్ లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన ప్రసూతి, శిశు సేవలపై వివరణాత్మక ప్రసంగం చేశారు. రాష్ట్రంలో ప్రసూతి మరణాలు, ఐదేళ్లలోపు శిశు మరణాల రేటును 2030 నాటికి గణనీయంగా తగ్గించా లన్న లక్ష్యంతో బహుముఖ విధానాన్ని రూపొందించామన్నారు. తాజా అంచనాల ప్రకారం ఐదేళ్ళలోపు శిశు మరణాల రేటు 2019లో నమోదైన వెయ్యికి 31 నుండి 2020లో వెయ్యికి 27కు తగ్గిందన్నారు. ఎర్లీ నియోనాటల్ మోర్టాలిటీ మరియు నియోనాటల్ మోర్టాలిటీ భారాన్ని ఏపీ గుర్తించిందన్నారు. ఈ సవాలును పరిష్కరించడానికి ప్రసూతి సంరక్షణ, ఇంట్రానాటల్ కేర్ మరియు తక్షణ ప్రసవానంతర సంరక్షణను బలోపేతం చేయడం, నవజాత శిశువు ఆరోగ్యసౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా బహుముఖ విధానాన్ని ఏపీ అనుసరిస్తోందన్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ఎస్ ఎన్ సియుల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం, అధిక భారంతో వున్న ఎస్ ఎన్ సియులలో మందులు, కన్జుమబుల్స్ కు బడ్జెట్ కేటాయింపులను పెంచడం, నాణ్యమైన సంరక్షణను అందించడం, తద్వారా నవజాత శిశు మరణాల్ని తగ్గించి, ఫలితాలను మెరుగుపరచడం ద్వారా నియోనాట ల్ కేర్ సేవలను మరింత బలోపేతం చేశామ న్నారు. తద్వారా ఎస్ ఎన్సియు మరణాల రేటులో గణనీయమైన తగ్గుదల నమోదయిం దన్నారు. అధిక మరణాలు నమోదవుతూ మాతా శిశు ఆరోగ్యానికి ప్రభావితం చేసే ప్రాంతాల్ని గుర్తించామన్నారు. సౌకర్యాల-స్థాయి, సమాజ స్థాయి సంరక్షణ రెండింటినీ బలోపేతం చేయడం ద్వారా అనారోగ్యం, మరణాలను తగ్గించడానికి దిద్దుబాటు చర్యల్ని చేపట్టామన్నారు. గిరిజన ప్రాంతాలలో, అధిక నవజాత శిశు మరణాలు నమోదయ్యే ప్రాంతాలలో 23 ఐదు పడకల, అలాగే 5 పది పడకల ఎస్ ఎన్ సియులను ఏపీలో ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎస్ ఎన్ సియు ల ద్వారా సేవల్ని మరింత విస్తరింపజేసి, నవజాత శిశువుల మరణాల్ని తగ్గించడానికి, అలాగే జబ్బుపడిన నవజాత శిశువులకు నాణ్యమైన సంరక్షణ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. న్యూబార్న్ స్టెబిలైజేషన్ యూనిట్‌లను (ఎన్ బిఎస్యులు) బలోపేతం చేసి, జబ్బుపడిన, తక్కువ బరువుతో పుట్టిన నవజాత శిశువులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణను అందించటానికి, ఎస్ ఎన్ సియులు, ఎన్బిసిసిలకు బలమైన రిఫరల్ లింక్‌లను ఏర్పాటు చేయడం కోసం పునర్వ్యవస్థీకరణ దిశగా చర్యలు తీసుకున్నామన్నారు.

నవజాత శిశువుల అనారోగ్యం, మరణాలను తగ్గించడానికి, పుట్టినప్పుడు అవసరమైన నవజాత సంరక్షణను అందించడానికి డెలివరీ పాయింట్ల వద్ద మొత్తం 1364 నవజాత శిశువు సంరక్షణ కార్నర్‌లు (ఎన్ బిసిసిలు) ఏర్పాటు చేశామని, 2024-25లో 37 కొత్త ఎన్బిసిసిలు మంజూరు చేశామని వివరించారు. బోధనాసు పత్రులలో మార్చి 2024లో 12 ఎస్ ఎన్ సియులు, 5 నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు (ఎన్ఐసియులు) ఏర్పాటు చేశామ న్నారు. రాష్ట్రం మొత్తంమీద నవజాత శిశు సంరక్షణను అందించడానికి 1055 పడకలు అందుబాటులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలు, అధికభారంతో వున్న ఎస్ ఎన్సియులలో నవజాత శిశువుల అనారోగ్యం మరియు మరణాలను మరింత తగ్గించడానికి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్ ఎంఎన్సిఎహెచ్ విధానాన్ని అనుసరిస్తూ భారతదేశ నవజాత కార్యాచరణ ప్రణాళిక (ఐఎన్ఎపి) అమలులో కీలక సవాళ్లను గుర్తించడానికి 2024-25లో విశ్లేషణతో కూడిన ప్రణాళికను రూపొందించామన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమీషనర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, డిఎంఇ ఎకడమిక్ డాక్టర్ జి.రఘునందన్, యునిసెఫ్ స్పెషలిస్ట్ (హైదరాబాద్ ఫీల్డాఫీస్ ) డాక్టర్ శ్రీధర్, అన్ని జిల్లాల డిఎంహెచ్ ఓలు మరియు డిసిహెచ్ ఎస్ లు, రాష్ట్ర నోడలాఫీసర్లు, యునిసెఫ్, ఎయిమ్స్ మంగళగిరి, ఫెర్నాండెజ్ ఫౌండేషన్, నూరా హెల్త్ కు చెందిన నిపుణులు పాల్గొన్నారు

# ఈ ఎన్నికల్లో ఏపీలో పట్టుబడ్డ నగదు అక్షరాల రూ.108 కోట్లు





**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈసీ ప్రత్యేక నిఘా ఉంచింది. సరిహద్దు ప్రాంతాల్లో 31 ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులతో సహా మొత్తం 150 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. 35 మొబైల్ బోర్డర్ పెట్రోలింగ్ పార్టీస్ ను అందుబాటులో ఉంచింది. వీటన్నింటితో పాటు 18 టెంపరరీ చెక్ పోస్ట్?లను కూడా ఏర్పాటు చేసింది. ఇలా ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో పట్టుబడ్డ నగదు, మద్యం వివరాలను ఈసీ తాజాగా వెల్లడించింది. గత 2019లో జరిగిన ఎన్నికల్లో పట్టుబడ్డ నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, లోహాలు విలువతో పాటుగా ఈ సారి 2024 సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన అక్రమ రవాణా గురించి పూర్తి వివరాలను వెల్లడించింది. 2019లో ఏపిలో పట్టుబడ్డ నగదు రూ.41.80 కోట్లు కాగా 2024 లో పట్టుబడ్డ నగదు రూ.107.96 కోట్లుగా తెలిపింది. మొత్తం కలిపి 7,305 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ప్రకటించింది. ఇక మద్యం విషయానికి వస్తే 2019 పట్టుబడ్డ అక్రమ మద్యం విలువ రూ.8.07 కోట్లుగా తెలిపింది. అదే 2024 లో పట్టుబడ్డ అక్రమ మద్యం విలువ రూ.58.70 కోట్లుగా చెప్పింది. ఈ సారి అదుపులోకి తీసుకున్న నిందితుల సంఖ్య గతంలో కంటే పెద్ద ఎత్తున పెరిగినట్లు తెలిపింది. మొత్తం 61,543 మంది అరెస్ట్ చేసినట్లు వెల్లడించింది. 2019 ఎన్నికల సమయంలో పట్టుబడిన నిషేధిత మాదక ద్రవ్యాల విలువ రూ. 5.04 కోట్లు కాగా 2024 ఎన్నికల్లో పట్టుబడిన నిషేధిత డ్రగ్స్ విలువ రూ. 35.61 కోట్లుగా తెలిపారు. ఈ వ్యవహారంలో మొత్తం 1730 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. ఇక 2019 ఎన్నికల సమయంలో స్వాధీనం చేసుకున్న విలువైన లోహాల విలువ రూ.27.17 కోట్లు కాగా.. 2024 ఎన్నికల్లో పట్టుబడిన విలువైన లోహాల విలువ రూ.123.62 కోట్లు అని చెప్పింది ఎన్నికల కమిషన్. ఈ అక్రమ వ్యవహారాల్లో పట్టుబడిన వారి సంఖ్య 42గా పేర్కొంది. 2019 ఎన్నికల సమయంలో స్వాధీనం చేసుకున్న ఉచితాలు/ఇతర వస్తువుల ద్రవ్య విలువ రూ.10.63 కోట్లు కాగా 2024 ఎన్నికల్లో పట్టుబడిన ఉచితాలు/ఇతర వస్తువుల విలువ రూ.16.98కోట్లుగా ప్రకటించింది. అక్రమంగా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడిన మొత్తం 233 మందిని అరెస్టు చేసినట్లు వివరించింది. మొత్తం 3,466 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు అధికారులు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఎన్నికలు చాలా ఖర్చుతో కూడుకున్నట్లు చెప్పవచ్చు. ఈ మొత్తాన్ని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు ప్రజలు.

## టీడీపీ నేత నాగలి రామకృష్ణారెడ్డి మృతి బాధాకరం : చంద్రబాబు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రొద్దుటూరు టీడీపీ నేత కె.రామకృష్ణారెడ్డి మృతి బాధాకరం అని అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. రామకృష్ణారెడ్డి మృతికి ఆయన సంతాపం తెలిపారు. ఎన్టీఆర్ హయాం నుండి ప్రతి మహానాడులో తెలుగుదేశం జెండాలో భాగమైన నాగలిని ఆయన బహుకరిస్తూ నాగలి రామకృష్ణారెడ్డిగా ప్రసిద్ధి చెందారని అన్నారు. పార్టీ స్థాపించిన నాటి నుండి క్రియాశీలకంగా పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. రామకృష్ణారెడ్డి ఆత్మకుశాంతి కలగాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు చంద్రబాబు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## కృష్ణావర్శిటీలో కౌంటింగ్ కేంద్రం తనిఖీ చేసిన సీఈవో ఎంకే మీనా




**మచిలీపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ):** కృష్ణా యూనివర్శిటీ లో ఏర్పాటు చేసిన ఓట్ల కౌంటింగ్ కేంద్రాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా సందర్శించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అధికారులు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన టేబుల్స్, రౌండ్ల వివరాలను సీఈవోకి కలెక్టర్ డీకే బాలాజీ వివరించారు. భద్రతాపరంగా తీసుకున్న చర్యలను మీనాకు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వివరించారు. త్వరితగతిన ఫలితాలను వెల్లడించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల రోజు, తర్వాత జరిగిన ఘర్షణలు, పరిణామాల నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సీఈవో మీనా.. కలెక్టర్, ఎస్పీని ఆదేశించారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అల్లర్లు జరగకుండా తగినంత బలగాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఏదైనా అనుకోని సంఘటనలు తలెత్తితే ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. కౌంటింగ్ వేళ ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా చూడాలన్నారు.

## కూటమి విజయం ఖాయం



**నెల్లూరు ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఎన్నికల ఫలితాల్లో కూటమి విజయం తథ్యమని.. పార్టీ అధినేత చంద్రబాబు సీఎం కాబోతున్నారని తెలిసి, అధికారుల్లో వణుకు మొదలైందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి అన్నారు. పారిపోయేందుకు సిద్ధమవుతున్నారు. టీటీడీలో ధర్మారెడ్డి పెద్ద బ్రోకర్ అని.. కరుణాకర్ రెడ్డి చిన్న బ్రోకర్ అని విమర్శించారు. ఎంపీ అవినాశ్ రెడ్డి వైఎస్ వివేకా హత్య కేసు నుంచి బయటపడేసేందుకు ధరారెడ్డి ఢిల్లీలో లాబీయింగ్ చేశాడన్నారు. జగన్ కుటుంబ సభ్యులే ఆ మాట చెప్పారన్నారు. ఢిల్లీలో ధర్మారెడ్డిపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. దొంగ సంతకాలతో సర్టిఫికెటట్లు ఇచ్చిన వ్యక్తి ధర్మారెడ్డి అని... అటువంటి వాళ్ళతో గోవిందుడి ఆలయం నడిపిస్తారా? అని ఆనం వివేకానందరెడ్డి మండి పడ్డారు.

## హత్యాయత్నం కేసులో టీటీడీ డిప్యూటీ ఈఈ శ్రీలక్ష్మి అరెస్ట్

**తిరుపతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** తిరుపతి నగరంలో సంచలనం రేపిన హత్యాయత్నం కేసులో టీటీడీ డిప్యూటీ ఈఈ శ్రీలక్ష్మితో పాటు మరో నలుగురిని అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతిలోని ఎన్జీవో కాలనీలో ఈ నెల 25న వెంకట శివారెడ్డి అనే వ్యక్తిపై హత్యయత్నం జరిగింది. ఆయన నివాసం ఉన్నచోటే ఇద్దరు దుండగులు ఆయనపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన వెంకట శివారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వెంకట శివారెడ్డి, శ్రీలక్ష్మి కుటుంబాలు ఒకే అపార్టుమెంట్లో ఉంటున్నాయి. అపార్ట్‌మెంట్లో ఎదురెదురు ఫ్లాట్‌లలో నివసిస్తున్నారు. అయితే.. గత కొంతకాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఒకరిపై ఒకరు కోపం పెంచుకున్నారు. ఈ క్రమంలోనే వెంకట శివారెడ్డిపై శ్రీలక్ష్మి కుటుంబం దాడి చేయించినట్లు విచారణలో తేలింది.

## దాడులు చేస్తారు... జాగ్రత్త : నాగబాబు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా.. అందరి దృష్టి ఏపీ అసెంబ్లీ ఫలితాల పైనే ఉన్నాయి. ఎవరు అధికారంలోకి రాబోతున్నారు..? ముఖ్య నాయకులు గెలుస్తారా? గెలిస్తే ఎంత మెజార్టీతో గెలుస్తారు? అనే తెలుగు రాష్ట్రాల్లో చర్చ చేస్తున్నారు. ముఖ్యంగా పిఠాపురంలో పవన్ కల్యాణ్ గెలుస్తారా? అనే దానిపై ఏకంగా బెట్టింగులు సైతం జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే జనసేన నేత నాగబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా(ఎక్స్) వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. కూటమి కార్యకర్తలు, నేతలకు పలు సూచనలు చేశారు. వైసీపీ ఓటమి ఖరారు అయిందని.. ఆ విషయం ఆ నేతలకు కూడా తెలిసిపోయిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఓటమిని తట్టుకోలేక కొంత ఉద్వేగానికి లోనై దాడులు నిర్వహిస్తారని.. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైసీపీ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంటుందని.. కాబట్టి అటువంటి వాటికి ప్రతిస్పందించొద్దని జనసేన పార్టీ కీలక నేత నాగబాబు పార్టీ కార్యకర్తలకు తెలిపారు. ఓటమి భయంతో వైసీపీ దాడులు చేసే అవకాశం ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సహనం కోల్పోవద్దని, సంయమనం పాటించాలని కోరారు.

## అవసరమైతే జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు : కలెక్టర్



కర్నూలు ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఎన్నికల కౌంటింగ్ కు సిద్ధంగా ఉన్నామని కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన పేర్కొన్నారు. కౌంటింగ్ సందర్భంగా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని.. 17 నుంచి 26 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి అవుతుందన్నారు. 144 సెక్షన్తో పాటు పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటుందన్నారు. అవసరమైతే జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 3 నుంచి ఇతర జిల్లాల వారు ఖాళీ చేయాలని.. కౌంటింగ్ కేంద్రాల నుంచి 2 కి.మీ దూరంలోని దుకాణాలను బంద్ చేయిస్తామన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

3,4 తేదీల్లో మద్యం దుకాణాలు బంద్ అంటూ కలెక్టర్ ప్రకటించారు. నగర శివారులో 8 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అన్ని పార్టీల ఆఫీసుల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విజయోత్సవాలు, ర్యాలీలపై నిషేధం అమలులో ఉందని జిల్లా కలెక్టర్ సృజన వెల్లడించారు.

## ప్రియుడిని కట్టేసి ప్రియురాలిపై స్నేహితుడు అఘాయిత్యం

**తిరుపతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** తిరుపతి జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ప్రియుడిని కట్టేసి ప్రియురాలిపై స్నేహితుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సూళ్లూరు పేట మండల పరిధిలోని దామరాయ గ్రామ పరిసరాల్లో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. బాధితులు వెల్లడించిన వివరాల ప్రకారం. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన యువకుడు, యువతి ఓ ప్రయివేటు సంస్థలో పనిచేస్తూ, సహజీవనం చేస్తున్నారు. ఆ యువకుడికి ఏడుమలై, బాలాజీ అనే ఇద్దరు మిత్రులు ఉన్నారు. మంగళవారం ఉదయం ఆ యువకుడు, ఏడుమలై సూళ్లూరుపేటలో మద్యం సేవించారు. ఆ తర్వాత ఇంటికి వచ్చేశారు. ఏడుమలై మళ్లీ రాత్రి ఆ యువకుడికి ఫోన్ చేసి నీ ప్రేయసి బర్త్‌డే కదా.. ఆమెను తీసుకుని కొరిడి శివాలయం వెళ్దామని చెప్పాడు. అది నమ్మిన ఆ యువకుడు కంపెనీలో పనికి వెళ్లిన ప్రియురాలి కోసం సూళ్లూరుపేటలోని వైజంక్షన్ వద్ద వేచి ఉండగా ఏడుమలై, బాలాజీ వచ్చారు. కొంతసేపటికి యువతి రావడంతో వారందరూ కలిసి శివాలయానికి బయల్దేరారు. ఈ క్రమంలో పులికాట్ తీరంలోని దామరాయ పరిసరాల్లోకి వెళ్లగా ఏడుమలై, బాలాజీ కలిసి ఆ యువకుడి చొక్కా విప్పి, దాంతోనే అతడిని కట్టేశారు. ఆ తర్వాత ఏడుమలై ఆ యువతిని బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్, నగదు లాక్కుని అక్కడి నుంచి పరారయ్యారు. ఎలాగోలా అక్కడి నుంచి ఇంటికి చేరుకున్న బాధితులు తమ కుటుంబ సభ్యులకు జరిగిన విషయం చెప్పారు. దాంతో వారు శ్రీహరికోట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## తనిఖీల్లో భారీగా పట్టుబడిన డబ్బు, నగదు



**నెల్లూరు, ప్రకాశం ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఎలక్షన్లు అయిపోయాయి కదా పోలీసులు తనిఖీలు ఉండవ్ కదా అని భ్రమపడుతున్నారు కొందరు. ఈ క్రమంలోనే అక్రమ మార్గాల్లో బంగారం రవాణాకి యత్నించి అడ్డంగా బుక్కవుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు వేర్వేరు చోట్ల అక్రమంగా తరలిస్తున్న గోల్డ్‌ను పోలీసులు సీజ్ చేశారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి, ప్రకాశం జిల్లా టంగుటూరులో బంగారం అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు.

కావలి సమీపంలోని గౌరవరం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు చెకింగ్ పాయింట్ ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. తెలంగాణలోని మిర్యాలగూడ నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఓ కారు అటుగా వచ్చింది. అందులోని వ్యక్తులు టెన్షన్ పడుతూ ఉండటంతో.. తనిఖీలు చేయగా 1497 గ్రాముల బంగారంతో పాటు రూ.1.61కోట్ల క్యాష్ బయటపడింది. సరైన పత్రాలు లేకపోవడంతో.. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు కావలి రూరల్ సీఐ కావేటి శ్రీనివాస్ తెలిపారు. మరో ఘటనలో ప్రకాశం జిల్లాలో అక్రమంగా కారులో తరలిస్తున్న బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

16వ నంబరు నేషనల్ హైవేపై టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎలాంటి డ్యాక్యుమెంట్స్, అనుమతులు లేకుండా లేకుండా చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి కారులో తరలిస్తున్న సుమారు 1200 గ్రాముల బంగారాన్ని గుర్తించారు. ఆ గోల్డ్ స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తితో పాటు మహిళను టంగుటూరు పోలీసుస్టేషన్‌కు తరలించి.. విచారిస్తున్నారు.

## ఈసెట్ ఫలితాలు విడుదల.. బాలికలదే పై చేయి




**అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ ఈసెట్ 2024 ఫలితాలు రిలీజ్ అయ్యాయి. అనంతపురం– జేఎన్‌టీయూలో ఈ సెట్ ఛైర్మన్ శ్రీనివాసరావు, కన్వీనర్ భానుమూర్తి, అధికారులు కలిసి ఈ ఫలితాలను విడుదల చేశారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి మే 8వ తేదీన నిర్వహించిన ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 36, 369 మంది విద్యార్థులు హాజరయ్యారు. అయితే, ఫలితాల్లో 90.41శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో బాలురు 89.35 శాతం కాగా, బాలికలు 93.34 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.


## ఎన్నికల అధికారులను మంత్రి కాకాణి బెదిరిస్తున్నారు: బీద రవిచంద్ర



**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్నికల అధికారులను మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి బెదిరిస్తున్నారని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆరోపించారు. నియోజకవర్గంలో అధికారులను తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారని, మాట వినని వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ నాయకులు చెప్పిన విధంగానే అధికారులు నడుచుకుంటున్నారని తాము ఐదేళ్లుగా మొత్తుకున్నామన్నారు. ఎన్నికలు మొదలయ్యాక కూడా కొంతమంది అధికారుల తీరు మారలేదన్నారు. అధికారుల పని తీరు బాగాలేదని కాకాణి ఇప్పుడు మాట్లాడుతున్నారని, తనకు అనుకూలంగా ఉంటే పనితీరు బాగున్నట్లు చెప్తారని ఎద్దేవా చేశారు.

ఎన్నికలకు నెలరోజులు ముందు పార్టీ కార్యక్రమాలకు తెదేపా నేత సోమిరెడ్డి తిరుగుతూ బిరుదవోలు గిరిజనుల పిల్లలకు చెప్పులు కొనుక్కునేందుకు డబ్బులు ఇస్తే దీనిపై మంత్రి కాకాణి ఫిర్యాదు చేశారన్నారు. ఎండలకు చెప్పులు లేకుండా తిరుగుతున్న చిన్నారులకు సహృదయంతో డబ్బులు ఇవ్వడాన్నీ వక్రీకరించారని గుర్తు చేశారు. ఎన్నికల వేళ పొదలకూరు మండలంలో, వరిగొండ, సర్వేపల్లి గ్రామాల్లో వైకాపా నేతలు మద్యం, నగదు విచ్చలవిడిగా పంపిణీ చేశారన్నారు. తెదేపా శ్రేణులపైనా దాడులు చేశారని దీనిపై మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీద కేసులు నమోదు చేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు.

## కాణిపాకం హుండీల లెక్కింపులో బ్యాంకు అప్రైజర్ చేతివాటం



**కాణిపాకం ( జర్నలిస్ట్ ఫైల్ ):** చిత్తూరు జిల్లా కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి ఆలయ హుండీల లెక్కింపులో బ్యాంకు అప్రైజర్ చేతివాటం ప్రదర్శించాడు. యాత్రికులు స్వామివారికి సమర్పించిన బంగారం, వెండి తదితర కానుకలను ఆలయ ఆస్థాన మండపంలో గురువారం లెక్కించారు. ఈ క్రమంలో స్థానిక బ్యాంకుకు చెందిన అప్రైజర్ ప్రకాశ్.. ఈ లెక్కింపులో 100 గ్రాముల బంగారు బిస్కెట్‌ను తన సంచిలో దాచుకున్నాడు. విషయాన్ని గుర్తించిన ఆలయ ఈవో సీసీ కెమెరాలను పరిశీలించి చోరీని ధ్రువీకరించారు. అనంతరం బంగారు బిస్కెట్‌ను స్వాధీనం చేసుకుని అతడిని కాణిపాకం పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## తెలంగాణ వార్తలు



# తెలంగాణలో కొత్తగా 27 రకాల బీర్లు

**కొత్తగా ఐదు కంపెనీలకు కాంగ్రెస్ సర్కారు అనుమతి**

**వీటిలో క్రాఫ్ట్ బీర్లే అధికం**

**రాష్ట్రంలో బీర్ల కొరతను అధిగమించేందుకే అన్న ఎక్సైజ్‌శాఖ**

హైదరాబాద్ : తెలంగాణలో కొత్తగా 27 రకాల బీర్లు రాబోతున్నాయి. దీనికోసం ఇప్పటికే కొత్తగా ఐదు బీర్ల తయారీ కంపెనీలకు ఈ ఏడాది రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ అనుమతులు కూడా మంజూరు చేసింది. అయితే, వీటిలో అధికంగా క్రాఫ్ట్ బీర్లే ఉన్నట్లు సమాచారం. తెలంగాణ బేవరేజ్ కార్పొరేషన్ కొత్తగా అనుమతులు ఇచ్చిన కంపెనీల్లో టాయిట్ బ్రేవరీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎక్సోటికా లిక్కర్ ప్రైవేట్ లిమిటెడ్, మౌంట్ ఎవరెస్ట్ లిమిటెడ్, లీలాసన్స్ ఆల్కా బేవ్ ప్రైవేట్ లిమిటెడ్, సోం డిస్టిలరీస్ అండ్ బేవరేజెస్ ఉన్నాయి.

ఇక ఎక్సైజ్‌శాఖ కొత్తగా అనుమతులు ఇచ్చిన కంపెనీల్లో ఒకటైన 'లీలాసన్స్ ఆల్కా బెవ్' సంగారెడ్డి జిల్లాలోని మల్లేపల్లిలో బీర్లను తయారు చేస్తుంది. ఇదే కంపెనీ ఏపీలో 'ట్రెడిషనల్ ఎక్సలెన్స్ ఇన్ క్వాలిటీ' అనే కంపెనీ పేరుతో బీర్లు విక్రయిస్తోంది. అలాగే చెన్నైలో 'సెయింట్ పాట్రిక్స్' పేరుతో మద్యం బీర్లు రూపొందిస్తోంది. కాగా, ఈ కంపెనీ మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందినది. 'అమెరికన్ బ్రూవ్ క్రాఫ్ట్ లిమిటెడ్ (ప్రై)'తో ఈ కంపెనీ టైఅప్ అయినట్లుగా తెలుస్తోంది.

'బ్లాక్ బస్టర్' పేరుతో నాలుగు ఫ్లేవర్లలో బీర్లను ఈ సంస్థ తయారు చేస్తోంది. కాగా తెలంగాణలో మాత్రం రెండు బ్రాండ్లను మాత్రమే అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొంది. అలాగే ఎక్సోటికా లిక్కర్ ప్రై. లి. కంపెనీ కూడా సంగారెడ్డి జిల్లా మల్లేపల్లిలో బీర్లను తయారు చేస్తున్నట్లు దరఖాస్తు చేసుకుంది. ఇదిలాఉంటే.. రాష్ట్రంలో ఉన్న బీర్ల కొరతను తగ్గించేందుకు కొత్తగా బీర్ల కంపెనీలకు అనుమతులు ఇచ్చామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ వెల్లడించింది.




# కేసీఆర్ ఇది చూడు... ఈ పడిగాపుల పాపం నీదే!

- కాంగ్రెస్ ఎదురుదాడి
- ఆదిలాబాద్‌లో విత్తనాల కోసం రైతులు క్యూలో నిల్చున్న ఫొటోను ప్రచురించిన 'నమస్తే తెలంగాణ'
- 11 నెలల క్రితం అదే ఆదిలాబాద్‌లో పత్తి విత్తనాల కోసం రైతుల పడిగాపుల ఫొటోను షేర్ చేసిన కాంగ్రెస్
- కేసీఆర్ తన పదేండ్ల పాపాన్ని తమపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని మండిపాటు

హైదరాబాద్, జర్నలిస్ట్ ఫైల్ : విత్తనాల కోసం రైతులు పడిగాపులు పడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ తిప్పికొట్టింది. ఈ పాపం మీదేనంటూ విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారంటూ 11 నెలల క్రితం ఓ మీడియా సంస్థ ప్రచురించిన స్క్రీన్‌షాట్‌ను కాంగ్రెస్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసింది. అధికారం చేతిలో ఉందని కన్నుమిన్ను కానకుండా ప్రవర్తించి, అన్ని వ్యవస్థలను, మరీ ముఖ్యంగా మీడియాను మేనేజ్ చేసి పదేండ్లు జనం పడే బాధలను తొక్కిపెట్టారని ఆ ఫొటోకు రాసుకొచ్చింది. ఇప్పుడు ప్రజాపాలన రాగానే పదేండ్ల పనితనం ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని తెలిపింది.

కట్టిన కాళేశ్వరం నుంచి మొదలుపెడితే ఎటుచూసినా తప్పులేనని, కేసీఆర్ పదేండ్ల పాపాన్ని తమపై రుద్దే దుర్మార్గానికి తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ రోజులు మళ్లీ రావడం కాదు.. మీ రాక్షస పాలనకు రోజులు దగ్గరపడి మీ కారు మూలకు పడిందన్న విషయం మళ్లీ గుర్తు చేయాలా మీ గులాబీలకు.. అని ప్రశ్నించింది.

కాగా, గురువారం నాటి 'నమస్తే తెలంగాణ' దినపత్రిక మొదటి పేజీలో ఆదిలాబాద్‌లో విత్తనాల కోసం రైతులు క్యూలో నిల్చున్న ఫొటోను ప్రచురించింది. దానికి కౌంటర్‌గా కాంగ్రెస్ ఇలా ఎక్స్‌లో 11 నెలల క్రితం అదే ఆదిలాబాద్‌లో పత్తి విత్తనాల కోసం రైతులు క్యూలో నిల్చున్న ఫొటోను షేర్ చేసి బీఆర్ఎస్‌పై విరుచుపడింది.

# ప్రేమికుడి మోసం.. యువతి ఆత్మహత్య

**హైదరాబాదులోని జీడిమెట్లలో ఘటన**



హైదరాబాద్ : ప్రేమికుడి మోసం తట్టుకోలేక హైదరాబాద్ కు చెందిన ఓ యువతి తనవు చాలించింది. తల్లిదండ్రుల మాటలు వినుంటే ఈ రోజు సంతోషంగా ఉండేదాన్నంటూ 14 పేజీల లేఖ రాసి ఆత్మహత్య చేసుకుంది. జీడిమెట్ల ఎస్సై ముంత ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం, ఠాణా పరిధిలోని ఎన్ఎల్‌బీ నగర్‌లో నివాసముండే బాలబోయిన అఖిల (22) ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేసేది. షాపుర్‌నగర్‌కు చెందిన అఖిల్ సాయిగౌడ్ గత కొన్నేళ్లుగా ప్రేమ పేరుతో అఖిలను వేధించేవాడు. ఆమె ఒప్పుకునే వరకూ వెంటపడ్డాడు.

ఈ విషయం యువతి కుటుంబసభ్యులకు తెలియడంతో బంధువుల సమక్షంలో అతడిని పిలిపించి మాట్లాడారు. పెళ్లి చేసుకుంటానని హామీ ఇవ్వడంతో అతడి ప్రేమను ఒప్పుకున్నారు. కొన్నేళ్ల పాటు ప్రేమాయణం సాఫీగా సాగింది. గత మూడు, నాలుగు నెలల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. చిన్న చిన్న విషయాలకు రోడ్డుపైనే అఖిలను కొడుతుండేవాడు. దీనికి తోడు అతడు పెళ్లికి నిరాకరించడంతో తన కుమార్తె మంగళవారం 14 పేజీల లేఖ రాసి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆమె తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# రాష్ట్ర చిహ్నం మార్పు.. మొదలైన రచ్చ!

**చిహ్నంలో చార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగింపు.. బీఆర్ఎస్ ధర్నాలో కేటీఆర్**

హైదరాబాద్, జర్నలిస్ట్ ఫైల్

తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని మార్చడంపైన ప్రస్తుతం తెలంగాణాలో రగడ కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నం నుండి చారిత్రక చిహ్నాలు అయిన చార్మినార్ ను, కాకతీయ కళాతోరణాన్ని తొలగించడం పైన బిఆర్ఎస్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తుంది. రాష్ట్ర చిహ్నంలో నుండి చార్మినార్, కాకతీయ కళా తోరణాన్ని తొలగించడంపై ఆందోళనలకు శ్రీకారం చుట్టింది బీఆర్ఎస్. రాచరికపు గుర్తులను చెరిపేస్తూ తెలంగాణా రాష్ట్ర కొత్త లోగో ఓవైపు తెలంగాణ ప్రభుత్వం అమరవీరుల పోరాటం, త్యాగాలను ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర నూతన చిహ్నం ఉంటుందని ప్రస్తుతం రాష్ట్ర చిహ్నంలో ఉన్న రాచరికపు గుర్తులను చెరిపేస్తూ, ప్రజాస్వామ్యాన్ని, ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా కొత్త లోగోను తయారు చేయడానికి ప్రభుత్వం కంకణబద్ధమై ఉన్నదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్ర నూతన చిహ్నం తుది రూపుదిద్దుకుంది. రేవంత్ సర్కారుపై కేటీఆర్ ప్రశ్నల వర్షం చార్మినార్ వద్ద బీఆర్ఎస్ నిరసనలో కేటీఆర్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఈ నూతన చిహ్నాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఇదిలా ఉంటే తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర చిహ్నంలో నుంచి చార్మినార్ ను, కాకతీయ కళా తోరణాన్ని తొలగించడం పై భగ్గుమంటుంది. ఈ క్రమంలో చార్మినార్ వద్ద నేడు నిరసన



కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొంటు న్నారు. శతాబ్దాలుగా హైదరాబాద్ కు ప్రతిరూపంగా చార్మినార్ తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నం నుంచి చార్మినార్ ను తొలగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నేడు ఆయన దీనిపై ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రభుత్వ చర్యను తప్పు పట్టిన ఆయన శతాబ్దాలుగా హైదరాబాద్ కు ప్రతిరూపంగా హైదరాబాద్ కీర్తికి గుర్తుగా చార్మినార్ కొనసాగుతుందని తన పోస్టులో వెల్లడించారు. రాష్ట్ర లోగో నుండి చార్మినార్ తొలగింపు .. ఎంత సిగ్గుచేటు హైదరాబాద్ గురించి ఎవరైనా తలుచుకుంటే చార్మినార్ ని గుర్తు చేసుకోక తప్పదని, యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందే అన్ని లక్షణాలు ఈ చారిత్రక నిర్మాణానికి ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పనికిమాలిన కారణాలను సాకుగా చూపించి చార్మినార్ చిహ్నాన్ని రాష్ట్ర లోగో నుంచి తొలగించాలని చూస్తోంది ఎంత సిగ్గుచేటు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని కేటీఆర్ తన పోస్టు ద్వారా తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర చిహ్నం పైన, జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతం పైన రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలపై ప్రస్తుతం బీఆర్ఎస్ శ్రేణుల నుండి నిరసనలు వ్యక్తం అవుతున్న వేళ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఈ వ్యవహారంలో రచ్చ కొనసాగుతుంది అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# రేవంత్ రెడ్డి ఇంట్లో కీరవాణి కంపోజింగ్.. ట్యూన్లు రెడీ

హైదరాబాద్, జర్నలిస్ట్ ఫైల్

జూన్ 2వ తేదీన ఆవిర్భావ దశమ దినోత్సవాల కోసం.. తెలంగాణ సర్వసన్నద్ధమౌతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగే తొలి వేడుకలు కావడం వల్ల దీన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వైభవంగా వ్యవస్థాపక దినోత్సవాలను జరుపుకోవడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ వేడుకలకు చీఫ్ గెస్ట్‌గా కాంగ్రెస్ పార్టీ మాజీ అధినేత్రి, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ హాజరు కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ మేరకు దేశ రాజధానిలో ఆమెతో భేటీ అయ్యారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలకు హాజరు కావాలంటూ ఆహ్వానించారు. ఇవే ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం కొత్త లోగోను ఆవిష్కరించబోతోంది. దీనికోసం రేవంత్ రెడ్డి ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారు. లోగోతో పాటు తెలంగాణ రాష్ట్ర గీతాన్నీ విడుదల చేస్తారు రేవంత్ రెడ్డి అదే రోజున. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో అందె శ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గేయంగా ఖరారు చేసింది ప్రభుత్వం. దీనికి ఆస్కార్ అవార్డ్ గ్రహీత ఎంఎం కీరవాణి సంగీతాన్ని సమకూర్చుతున్నారు. ఈ గీతానికి మ్యూజిక్ కంపోజింగ్ దాదాపుగా



పూర్తయినట్టే కనిపిస్తోంది. ఈ మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ రెడ్డి నివాసంలో కంపోజింగ్ పెట్టారు కీరవాణి. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, గేయ రచయిత అందె శ్రీ, అద్దంకి దయాకర్.. తదితరులు ఇందులో పాల్గొన్నారు. వారికి ట్యూన్లను వినిపించారు కీరవాణి. నేపథ్య గాయకుడు ఎల్ వీ రేవంత్ సహా కొందరు ప్లేబ్యాక్ సింగర్లు.. జయ జయహే తెలంగాణ గేయాన్ని పాడి వినిపించారు. అందెశ్రీ రాసిన గీతం ఇది. జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం.. ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం అంటూ సాగుతుంది. తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసేలా, ప్రతి ఒక్కరిలో స్ఫూర్తినింపేలా అందెశ్రీ రాశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కోట్లాదిమంది నోట్లో నానిందీ పాట. అత్యంత ప్రజాదరణ పొందిన ఈ గీతాన్ని ఇదివరకే రాష్ట్ర గేయంగా ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర వేడుకలు, తెలంగాణ లిబరేషన్ డే సహా అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ జాతీయ గీతంతో పాటు ఈ పాటను వినిపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

# తెలంగాణ రాష్ట్ర చిహ్నం లోగో ఆవిష్కరణ వాయిదా

- తెలంగాణ తల్లి, కొత్త చిహ్నం ఆవిష్కరణపై సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు సీఎం వెల్లడి
- దశాబ్ది ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా తెలంగాణ గీతాన్ని మాత్రమే ఆవిష్కరిస్తున్నట్లు వెల్లడి
- రాష్ట్ర చిహ్నంలో కాకతీయ తోరణం, చార్మినార్ తొలగింపు యత్నాలపై బీఆర్ఎస్ ఆగ్రహం



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర చిహ్నం కొత్త లోగో ఆవిష్కరణను కాంగ్రెస్ ప్రభుత్వం వాయిదా వేసింది. చివరి నిమిషంలో ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ తల్లి, కొత్త చిహ్నం ఆవిష్కరణపై సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు తెలిపింది. ఈ కారణంగా జూన్ 2న తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా కేవలం తెలంగాణ గీతాన్ని మాత్రమే ఆవిష్కరిస్తున్నట్లు స్పష్టం చేసింది. అధికార చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహంపై ఇంకా స్పష్టత రాలేదని తెలిపింది. 200 వరకు సూచనలు రావడంతో మరిన్ని చర్చలు జరపాలని నిర్ణయించింది. చర్చల తర్వాతే అధికార చిహ్నం ఖరారు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

తెలంగాణ రాష్ట్ర గీతం, చిహ్నం విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొన్నిరోజులుగా ప్రముఖులతో చర్చలు జరుపుతున్నారు. ప్రజల పోరాటం, త్యాగాలు ప్రతిబింబించేలా రాష్ట్ర చిహ్నం రూపుదిద్దుకోనున్నట్లు చెబుతున్నారు. అయితే రాష్ట్ర చిహ్నంలో కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని... ఇది సరికాదని బీఆర్ఎస్ వర్గాలు మండిపడుతున్నాయి.

**వందలాది మంది బలిదానాలకు కారణమైన సోనియాను**

# దశాబ్ది వేడుకలకు పిలుస్తారా..

**ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్**

**సోనియాగాంధీ క్షమాపణలు చెప్పాకే దశాబ్ది వేడుకలకు రావాలని డిమాండ్**

**బండి సంజయ్, కిషన్ రెడ్డిల ఫోన్లనూ ట్యాపింగ్ చేశారని ఆరోపణ**

హైదరాబాద్, జర్నలిస్ట్ ఫైల్



తెలంగాణ ఉద్యమం సమయంలో వందలమంది బలిదానాలకు కారణమైన సోనియాగాంధీని రాష్ట్ర దశాబ్ది వేడుకలకు ఆహ్వానించడంపై రాష్ట్ర బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలకు ఆమె క్షమాపణలు చెప్పి దశాబ్ది వేడుకలకు రావాలన్నారు. అధికారిక వేడుకలు అన్నప్పుడు నాటి ప్రధాని, పార్లమెంట్‌లో మద్దతిచ్చిన పార్టీలను ఎందుకు ఆహ్వానించడం లేదని ప్రశ్నించారు.

తెలంగాణ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలను ఆహ్వానించనప్పుడు అది పార్టీ కార్యక్రమమే అవుతుందని విమర్శించారు. దశాబ్ది వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం, ఉద్యమకారులు, తెలంగాణవాదులతో చర్చలు జరపలేదన్నారు. సోనియాను పిలవడం ఆపేసి... మిగతా పక్షాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర చిహ్నం బయటకు వచ్చిన తర్వాత తమ పార్టీ నాయకత్వం సమావేశమై నిర్ణయం తీసుకుంటుందన్నారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లాక్కునే ప్రయత్నం**

సీఎం కేసీఆర్ కుంభకోణాలను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ లాక్కునే ప్రయత్నం చేస్తున్నట్లుగా కనిపిస్తోందన్నారు. తెలంగాణలో ప్రతి వారం ఒక్కో కుంభకోణం బయటకు వస్తోందన్నారు. గత ప్రభుత్వ కుంభకోణాలు ఒక్కొక్కటి బయటపడుతున్నప్పటికీ సీఎం మాట్లాడటం లేదని విమర్శించారు. పౌరసరఫరాల శాఖలోనూ అక్రమాలు జరిగినట్లుగా వెలుగు చూస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలోని అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు కోరాలన్నారు.

**వారి ఫోన్లూ ట్యాప్ అయ్యాయి**

ఎంతోమంది ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేసినట్లుగా వార్తలు వచ్చాయని... వీటిపై ఇంకా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సీఎం రేవంత్ రెడ్డి చాలా తేలికగా తీసుకుంటున్నట్లు ఉందన్నారు. రేవంత్ రెడ్డి కూడా ఫోన్ ట్యాపింగ్‌ను రాజకీయంగా ఉపయోగించుకునే అవకాశముందని అనుమానం వ్యక్తం చేశారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి సహా అనేక మంది బీజేపీ నేతల ఫోన్లు ట్యాప్ అయ్యాయని, ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ దర్యాప్తు లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గతంలో డ్రగ్స్, పేపర్ లీకేజీల, నయిమ్ వ్యవహారం వచ్చినపుడు వాటిని కేసీఆర్ రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు.



# ఉద్దేశపూర్వకంగానే రాజముద్ర మార్పు

- చార్మినార్‌కు కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు
- అధికారిక ముద్ర మార్పును నిరసిస్తూ చార్మినార్ వద్ద ధర్నా
- రాజముద్ర నుంచి చార్మినార్‌ను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- హైదరాబాద్ ఐకాన్‌గా చార్మినార్ ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిందన్న కేటీఆర్
- కేసీఆర్ పెట్టిన గుర్తులు మార్చాలని చూస్తున్నారంటూ రేవంత్‌పై మండిపాటు

హైదరాబాద్ : రాజకీయ కుట్రతోనే కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వకంగా రాజముద్రను మార్పు చేయాలని నిర్ణయించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ అధికారిక ముద్ర మార్పును నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలతో కలిసి చార్మినార్ వద్ద ఆయన ధర్నాకు దిగారు. రాజముద్ర నుంచి చార్మినార్‌ను తొలగించడానికి కుట్ర జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ అనగానే మొదట గుర్తొచ్చేది హైదరాబాద్, చార్మినార్ అని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఐకాన్‌గా చార్మినార్ ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిందన్నారు.

నాడు ఎన్టీఆర్ కాకతీయ కళాతోరణం ప్రతిమను ట్యాంక్‌బండ్‌కు ఇరువైపులా పెట్టారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని, కేసీఆర్ పెట్టిన గుర్తులు మార్చాలని చూస్తున్నారంటూ మండిపడ్డారు. గత పదేళ్లలో చేసిన ప్రగతిని కనిపించకుండా చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షగట్టిందని దుయ్యబట్టారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోకుండా ఇలాంటి పనికిమాలిన చర్యలకు దిగడం సరికాదని అన్నారు. అసలు సీఎం రేవంత్‌కు ఇలా రాజముద్రను మార్చాల్సిన అవసరం ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు.




# ఇక టీఎస్‌పీఎస్సీ కాదు.. ఇకపై టీజీపీఎస్సీ


**గ్రూప్ 1 ప్రిలిమ్స్ 9న, 1 నుంచి హాల్ టికెట్లు**

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం అధికారిక కమ్యూనికేషన్‌లో టీఎస్ స్థానంలో టీజీని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TSPSC)ని టీజీపీఎస్సీ(TGPSC)గా మారుస్తూ సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా పిలవబడిన టీఎస్‌పీఎస్సీ.. ఇప్పుడు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా మారింది.

**జూన్ 9న గ్రూప్ 1 ప్రిలిమ్స్**

తెలంగాణ గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష జూన్ 9న నిర్వహించనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెల్లడించింది. జూన్ 1న మధ్యాహ్నం 2 గంటల నుంచి టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ https://www.tspsc.gov.inలో హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. జూన్ 9వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇక, ఈ పరీక్షకు 30 నిమిషాల ముందే అంటే ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న గేట్లు మూసివేస్తారని అధికారులు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి ప్రతి పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలెటర్లు అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకుంటారని చెప్పారు. ఆబ్జెక్టివ్ టైప్ ఓఎంఆర్ విధానంలో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష జరగనుంది. నమూనా ఓఎంఆర్ షీట్‌ను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అక్టోబర్ 21 నుంచి మెయిన్స్ పరీక్షలను నిర్వహించనుంది.

# సెక్స్ స్కాండల్.. వీడియోలోని ఆ ఆడియో ఎవరిది?



**బెంగళూరు :** సెక్స్ స్కామ్ కేసులో హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను అరెస్టు చేస్తే వాయిస్ పరీక్షలు నిర్వహించే అంశాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పరిశీలిస్తోంది. తద్వారా పెన్ డ్రైవ్‌లోని అశ్లీల వీడియోల్లో ఉన్న ఆ పురుషుడి స్వరం ఎవరిదో అనే విషయం తేలిపోతుందని అధికారులు అంటున్నారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను ఇప్పుడు ఆ వీడియోలోని ఆడియో తీవ్ర ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉంది. పెన్ డ్రైవ్‌లోని అశ్లీల వీడియోలలో వినిపించే పురుషుడి వాయిస్‌తో ఈ వాయిస్ టెస్ట్‌ను పోల్చడం ద్వారా అత్యాచారం జరిగినట్లు నిరూపించేందుకు సిట్‌కి ముఖ్యమైన వైద్యపరీక్షలు సాక్ష్యంగా లభిస్తుందని సంబంధిత అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వాయిస్ టెస్ట్ చాలా కీలకమని, వైద్యపరీక్షల అనంతరం కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న హాసన్ ఎంపీ ప్రజ్వల్ ఇదే మే 31వ తేదీన విదేశాల నుంచి భారత్‌కు తిరిగి రావడానికి విమానం టిక్కెట్టు బుక్ చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు హాసన్‌లో ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన అశ్లీల వీడియోలు సోషల్ మీడియాలో విడుదల కావడం సంచలనం సృష్టించింది. లైంగిక వేధింపుల కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ ఇప్పుడు పెన్ డ్రైవ్‌లలో లోడ్ చేసిన అశ్లీల వీడియోలను స్వాధీనం చేసుకుంది. ఆ అశ్లీల వీడియోలు ఎవరివి అని పరిశీలించడానికి ఆ పెన్ డ్రైవ్ ను ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించారు. ఇప్పుడు ఎఫ్ఎస్ఎల్ నివేదిక కోసం సిట్ ఎదురుచూస్తోంది. హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అశ్లీల వీడియోల అని చెప్పుకుంటున్న ఆ వీడియోల్లో ఓ పురుష స్వరం ఉంది. కొన్ని అశ్లీల వీడియోలలో పురుష స్వరం వినిపిస్తుంది. ఆ వ్యక్తి కొంతమంది బాధితులతో మాట్లాడిన సంభాషణల క్లిప్పింగ్స్ ఉన్నాయి. కానీ వీడియోల్లో మాట్లాడుతున్న అతని వ లైంగిక వేధింపులు, అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ గొంతును వీడియోల్లో మాట్లాడిన పురుషుడితో పోల్చడానికి వాటిని ల్యాబ్ కు పంపిస్తున్నారు. రెండు స్వరాలలో పోలిక కనిపిస్తే హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై వస్తున్న ఆరోపణలను రుజువు చేయడానికి వైద్యపరీక్షల ఆధారాలు పనికొస్తాయని అధికారులు అంటున్నారు. వైద్యపరీక్షల నివేదికను కూడా కోర్టుకు సమర్పించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

లైంగిక వేధింపుల కేసు తర్వాత విదేశాల్లో అజ్ఞాతంలో ఉన్న ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ మే 31వ తేదీన స్వదేశానికి తిరిగి వచ్చి సిట్ ఎదుట హాజరవుతానని ఇటీవల ఓ వీడియో స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ ప్రకటన తర్వాత ప్రజ్వల్‌పై తదుపరి విచారణ చర్యలకు కూడా సిట్ సిద్ధమైంది. హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించడానికి సిట్ సిద్ధం అవుతోందని తెలిసింది. లైంగిక వేధింపుల కేసుకు సంబంధించి ప్రజ్వల్ రేవణ్ణకు కొన్ని వైద్యపరీక్షలతో పాటు వాయిస్ టెస్ట్ కూడా నిర్వహించాల్సి ఉంటుందని సమాచారం. ప్రజ్వల్‌ని అరెస్ట్ చేస్తే బెంగళూరులోని బౌరింగ్ ఆస్పత్రి లేదా విక్టోరియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. మొత్తం మీద హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ భారతదేశానికి తిరిగిరావడానికి కౌంట్ డౌన్ మొదలైయ్యింది. ఈ అశ్లీల వీడియో కేసు ఎక్కడి నుంచి ఎక్కడికి దారితీస్తుందో అనే విషయం వేచిచూడాలి అంటున్నారు కొందరు జేడీఎస్ కార్యకర్తలు.

# జనాలకు చల్లని కబురు.. కేరళను తాకిన నైరుతి..

**సాధారణం కన్నా రెండు రోజుల ముందే పలకరించాయని ప్రకటన**

**రెమాల్ తుపాను ప్రభావంతో రుతుపవనాలు బాగా విస్తరించాయని వెల్లడి**

**ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయన్న ఐఎండీ డైరెక్టర్ జనరల్**

భానుడి భగభగలతో అల్లాడుతున్న దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు చెప్పింది. కేరళలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినట్లు గురువారం ప్రకటించింది. వాస్తవానికి జూన్ 1న నైరుతి రుతుపవనాలు కేరళను తాకాల్సి ఉండగా ఈసారి రెండు రోజులు ముందుగానే ప్రవేశించాయని తెలిపింది. కేరళతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నట్లు పేర్కొంది.

'బంగాళాఖాతంలో రుతుపవనాలు చాలా చురుకుగా కదులుతున్నాయి. రెమాల్ తుపాను కారణంగా ఈ ప్రాంతమంతా రుతుపవనాలు విస్తరించాయి. ఈశాన్య రాష్ట్రాల్లో రెండు రోజులుగా అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే కేరళలోకి నైరుతి రుతుపవనాల ప్రవేశాన్ని సూచించే ప్రమాణాలన్నీ సరిపోలాయి' అని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ ఎం. మొహాపాత్ర తెలిపారు. ఏటా మే 10వ తేదీ తర్వాత 14 కేంద్రాలకుగాను 60 శాతం కేంద్రాల్లో వరుసగా రెండు రోజులపాటు 2.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిస్తే కేరళలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని ఐఎండీ ప్రకటిస్తుంది. మినికోయ్, అమిని, తిరువనంతపురం, పునలూర్, కొల్లాం, అలప్పుజా, కొట్టాయం, కొచ్చి, త్రిసూర్, కోజీకోడ్, తాలస్సేరి, కన్నూర్, కుడులు, మంగళూరు కేంద్రాల్లో వం-ర్షం కురిసిన రెండో రోజున నైరుతి రాకను ధ్రువీకరిస్తుంది.



అయితే నైరుతి ప్రవేశించాలంటే గాలి నైరుతి దిశలో వీస్తుండటంతోపాటు ఔట్ గోయింగ్ లాంగ్ వేవ్ రేడియేషన్ (ఓఎల్ ఆర్) తక్కువగా ఉండాలి. అంతరిక్షంలోకి వాతావరణం విడుదల చేసే మొత్తం రేడియేషన్ నే ఓఎల్ ఆర్ గా పేర్కొంటారు. ఈ ఏడాది దేశమంతా సాధారణంకన్నా ఎక్కువ వర్షాలు కురుస్తాయని ఐఎండీ ఇప్పటికే ప్రకటించింది. మొత్తమీద 106 శాతం మేర వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏప్రిల్ 15న విడుదల చేసిన వాతావరణ అంచనాల్లో తెలిపింది. ఇప్పుడు కేరళలోకి నైరుతి ప్రవేశించడంతో రుతుపవనాలు క్రమంగా ఉత్తరం వైపు కదలనున్నాయి. దీనివల్ల ఎండ వేడితో అల్లాడుతున్న ఉత్తరాది ప్రాంతాలకు వర్షాలతో ఉపశమనం లభించనుంది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో 51 శాతం పంటల సాగు వర్షాలపైనే ఆధారపడి ఉంది. దేశంలో మొత్తం లభించే పంటల దిగుబడిలో ఇది 40 శాతం. అలాగే దేశ జనాభాలో 47 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడటంతో విస్తారంగా వర్షాలు కురవడం పల్లెల ఆర్థిక ప్రగతికి ఎంతో ముఖ్యం.



# ధ్యానం చేయడానికి కెమెరా తీసుకెళ్తారా?

**మోడీపై మమత సెటైర్లు..ఈసీకి ఫిర్యాదు చేస్తా..**


**కోల్‌కతా :** దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుకుంటోంది. రేపటితో ఏడో దశ ఎన్నికల ప్రచారం ముగియనుంది. జూన్ 1న తుది దశ లోక్ సభ ఎన్నికలు జరగబోతున్నాయి. జూన్ 4న ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించబోతున్నారు. అయితే సుదీర్ఘంగా సాగిన ఎన్నికల ప్రచారంలో తీరిక లేకుండా ఉన్న ప్రధాని మోడీ ఎన్నికల తుది దశ పోలింగ్ ముగియగానే తమిళనాడులోని కన్యాకుమారికి వెళ్లి రెండు రోజుల పాటు ధ్యానంలో నిమగ్నం కాబోతున్నారు. దీనిపై విపక్షాలు సెటైర్లు మొదలుపెట్టేశాయి. ప్రధాని మోడీ కన్యాకుమారి ధ్యాన పర్యటనపై స్పందిస్తూ.. ఎవరైనా మెడిటేషన్ చేసుకోవచ్చని, అయితే దానికి కెమెరా తీసుకెళ్లాలా అంటూ బెంగాల్ సీఎం, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రశ్నించారు. ఫలితాలకు 48 గంటల ముందు ప్రధాని మోడీ మెడిటేషన్ పేరుతో ఏసీ రూమ్ లోకి వెళ్లి కూర్చుంటారన్నారు. తాను కూడా కన్యాకుమారి వెళ్లాలనుకున్నానని, కానీ మోడీ టూర్ తో విరమించుకున్నట్లు తెలిపారు. తనను దేవుడు ఓ కారణం చేత పంపాడంటూ మోడీ చేసిన వ్యాఖ్యలపైనా మమతా బెనర్జీ స్పందించారు. ఆయన దేవుడైతే మెడిటేషన్ అవసరం ఎందుకు వచ్చిందన్నారు. ఇతరులు ఆయన కోసం మెడిటేషన్ చేయాలన్నారు. కన్యాకుమారిలో ప్రధాని మోడీ మెడిటేషన్ ను టీవీల్లో చూపిస్తే మాత్రం ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై చర్యలు కోరుతూ ఈసీని ఆశ్రయిస్తామని మమతా బెనర్జీ హెచ్చరించారు. తద్వారా మోడీ మార్కెటింగ్ ఎత్తుల్ని జనంలోకి తీసుకెళ్తామని ఆమె తెలిపారు.

# పూరీ జగన్నాథుని ఆలయంలో అగ్నిప్రమాదం

**15 మందికి తీవ్ర గాయాలు.. చందన ఉత్సవం సందర్భంగా ఘటన**

పూరీ , జర్నలిస్ట్ ఫైల్

ఒడిశాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పూరీ జగన్నాథుని ఆలయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 15 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. స్వామివారి ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులపై బాణసంచా నిప్పులు చెలరేగాయి. బుధవారం రాత్రి పూరీలోని నరేంద్ర పుష్కరిణిలో జగన్నాథుడికి చందన ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు బారులు తీరారు. ఈ నేపథ్యంలో కొంతమంది భక్తులు టపాసులు పేల్చడంతో నిప్పురవ్వలు సమీపంలో బాణసంచా నిల్వ ఉంచిన చోటపడ్డాయి. దీంతో పెద్దఎత్తున పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో పలువురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం నుంచి కొంతమంది తమనుతాము రక్షించుకునేందుకు పుష్కరిణిలోకి దూకారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై ఘటనపై ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు మెరుగైన



చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. చికిత్సకు అవసరమైన మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని సిఎం హామీ ఇచ్చారు. పూరీ జగన్నాథుని ఆలయంలో ప్రతి ఏడాది ఆషాడ శుద్ధ విదియ నాడు రథయాత్రను నిర్వహిస్తారు. ఈ రథయాత్ర కోసం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జగన్నాథుని దర్శనం కోసం విచ్చేస్తారు. ఇక, ఈ ఉత్సవం కోసం రెండు నెలల ముందు నుంచే రథాలను తయారుచేసే ప్రక్రియను ప్రారంభిస్తారు. అలాగే, ఆలయంలో వైశాఖ బహుళ షష్ఠి రోజున స్వామివారికి చందనోత్సవం, జలక్రీడలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే అక్కడ బుధవారం చందనోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది.

## జాతీయ వార్తలు



# కేంద్రం.. గుట్టు చప్పుడు కాకుండా

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా కొన్ని నెలల పాటు హింసాత్మక పరిస్థితులు, దాడులు, నిరసన ప్రదర్శనలకు దారి తీసిన అత్యంత వివాదాస్పద యాక్ట్.. జాతీయ పౌరసత్వ సవరణ చట్టం. ఇది మరోసారి తెర మీదికి వచ్చింది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తుదిదశకు చేరుకున్న వేళ.. వివాదాలకు తెర తీసినట్టయింది. జూన్ 1వ తేదీన చివరి విడత అంటే ఏడో దశ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగాల్సిన ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం.. గుట్టు చప్పుడు కాకుండా పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. కేంద్రంలో అధికారంలో భారతీయ జనతా పార్టీకి ఏ మాత్రం కొరుకుడు పడని విధంగా తయారైన పశ్చిమ బెంగాల్‌లో దీన్ని మొట్టమొదటిసారిగా అమలు చేసింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీ చేసింది. జాతీయ పౌరసత్వ సవరణ చట్టం రూల్స్ 2024 ప్రకారం ధృవీకరణ పత్రాలను మంజూరు చేసే ప్రక్రియ పశ్చిమ బెంగాల్ ప్రారంభించినట్లు వెల్లడించింది. పశ్చిమ బెంగాల్ నుంచి దాఖలైన తొలి సెట్ దరఖాస్తులకు నేడు పశ్చిమ బెంగాల్ సాధికార కమిటీ సర్టిఫికెట్లను మంజూరు చేసినట్లు పేర్కొంది. హర్యానా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల సాధికార కమిటీలు కూడా సీఏఏ రూల్స్ ప్రకారం- దరఖాస్తుదారులకు పౌరసత్వ సర్టిఫికెట్లను మంజూరు చేశాయి. క్రమంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇది అమలులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. తెలంగాణ, తమిళనాడు, కేరళ వంటి కొన్ని రాష్ట్రాలు దీన్ని తాము అమలు చేయబోమంటూ అసెంబ్లీలో తీర్మానించిన విషయం తెలిసిందే పౌరసత్వ సవరణ చట్టాన్ని ఈ ఏడాది మార్చి 11వ తేదీన నోటిపై చేసిన విషయం తెలిసిందే. దీని ప్రకారం- సీఏఏ నిబంధనల కింద దాఖలయ్యే దరఖాస్తులను పరిశీలించడానికి, వాటిని ప్రాసెస్ చేయడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జిల్లా, రాష్ట్ర స్థాయి సాధికార కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ద్వారా ఆ దరఖాస్తులను పరిశీలించి పౌరసత్వ సర్టిఫికెట్లను మంజూరు చేయొచ్చని సిఫారసు చేస్తాయి. దరఖాస్తుల ప్రాసెసింగ్ పూర్తిగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా జరుగుతుంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందూ, సిక్, జైన, బౌద్ధ, పార్సీ, క్రైస్తవ సామాజిక వర్గాలకు పౌరసత్వాన్ని కల్పించడం దీని ఉద్దేశం. ఆయా దేశాల నుంచి భారత్‌కు వచ్చిన ముస్లింలకు ఇది వర్తించదు.




# కోమాలో ఉన్న భర్త ఆస్తి అమ్మేందుకు భార్యకు మద్రాస్ హైకోర్టు అనుమతి

- భర్త కోమాలో ఉండడంతో, అతడి ఆస్తి అమ్మే హక్కు కోరుతూ మహిళ పిటిషన్
- మహిళ అభ్యర్థనను తోసిపుచ్చిన సింగిల్ జడ్జి బెంచ్
- తీర్పుపై మహిళ అప్పీలు
- చట్టంలో లేకపోయినా మహిళను సంరక్షకురాలిగా నియమిస్తూ ఉత్తర్వులు
- కేరళ హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా తీర్పు

చెన్నై: భర్త కోమాలో ఉంటే అతడి ఆస్తి అమ్మేందుకు భార్యకు హక్కు ఉంటుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. అనారోగ్యంతో కోమాలోకి వెళ్లిన భర్త ఆస్తులకు తనను గార్డియన్‌గా నియమించాలంటూ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ మేరకు తీర్పు వెలువరించింది. శశికళ అనే మహిళ ఈ పిటిషన్ దాఖలు చేశారు. తొలుత సింగిల్ జడ్జ్ బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. చట్టంలో ఇందుకు అవకాశం లేదని స్పష్టం చేసింది. సివిల్ కోర్టును ఆశ్రయించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ తీర్పుపై శశికళ చేసుకున్న అప్పీలుపై జస్టిస్ స్వామినాథన్, జస్టిస్ బాలాజీల ధర్మాసనం విచారణ చేపట్టింది. చట్టంలో ఏ వెసులుబాటు లేకపోయినా మహిళ సంరక్షకురాలు అనేలా కోర్టు ఉత్తర్వులు ఇవ్వొచ్చని గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. భర్త ఆస్తుల నిర్వహణకు భార్యకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేసింది. శశికళను తన భర్త శివకుమార్‌కు గార్డియన్‌గా నియమించి, రూ.కోటి విలువైన ఆస్తిని విక్రయించేందుకు అనుమతించింది. ఇందులో రూ.50 లక్షలు శివకుమార్‌పై ఫిక్స్ డిపాజిట్ చేసి వచ్చే వడ్డీ వినియోగించుకోవచ్చని పేర్కొంది.

# 1982 వరకు గాంధీ ఎవరో ప్రపంచానికి తెలీదు

**గాంధీని సరిగా ప్రమోట్ చేసుకోలేకపోయామన్న మోదీ**

**గాంధీ గురించి ఎవరికీ తెలియదని చెప్తున్నందుకు తనను క్షమించాలన్న ప్రధాని**

**మోదీ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు విరుచుకుపడిన రాహుల్‌గాంధీ, సీతారాం ఏచూరి**

**న్యూఢిల్లీ:** 1982లో రిచర్డ్ అటన్‌బరో తీసిన 'గాంధీ' సినిమా వచ్చే వరకు మహాత్మాగాంధీ ఎవరో ఈ ప్రపంచానికి తెలియదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "గత 75 ఏళ్లలో మహాత్మాగాంధీ గురించి ఈ ప్రపంచానికి తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందా? లేదా? ఆయన గురించి ఎవరికీ తెలియదు. ఈ విషయం చెబుతున్నందుకు నన్ను క్షమించండి. గాంధీ సినిమా వచ్చిన తర్వాతే ప్రపంచానికి ఆయన గురించి తెలిసింది" అని ఏబీపీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సినిమా వచ్చిన తర్వాతే ఆయన ఎవరో తెలుసుకునేందుకు ప్రపంచం ఆసక్తి చూపిందని మోదీ వ్యాఖ్యానించారు.

**మోదీ లాంటి పొలిటికల్ సైన్స్ స్టూడెంట్‌కే ఆ సినిమా అవసరం**

మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని మోదీ ఎంఏ డిగ్రీ సర్టిఫికెట్‌ను ఉద్దేశిస్తూ.. పొలిటికల్ సైన్స్ విద్యార్థి మాత్రమే గాంధీ గురించి తెలుసుకునేందుకు ఆయన సినిమా చూడాల్సిన అవసరం ఉందని ఎద్దేవా చేశారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి కూడా మోదీ వ్యాఖ్యలపై విస్మయం వ్యక్తం చేశారు. మోదీ అలాంటి వ్యాఖ్యలు చేయడం తనను షాక్‌కు గురిచేశాయని పేర్కొన్నారు. శాంతి, అహింసకు చిహ్నమైన గాంధీ వారసత్వాన్ని ఎవరూ ప్రమోట్ చేయాల్సిన అవసరం



లేదన్నారు. మోదీ పుట్టకముందే గాంధీ ఐదుసార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారని గుర్తుచేశారు.

**విరుచుకుపడిన సోషల్ మీడియా**

సోషల్ మీడియా కూడా మోదీ వ్యాఖ్యలను తప్పుబడుతూ విరుచుకుపడింది. ఆయన వ్యాఖ్యలు అబద్ధమని నిరూపిస్తూ పాతకాలం నాటి పేపర్ క్లిప్పింగ్‌లను యూజర్లు పెద్ద ఎత్తున షేర్ చేస్తున్నారు. గాంధీ హత్యను ప్రపంచవ్యాప్తంగా హెడ్‌లైన్స్‌లో ప్రచురించిన దినపత్రికల క్లిప్పింగులను పోస్టు చేస్తున్నారు. ప్రపంచం మొత్తానికి మోదీ తెలుసని, అందుకు ఇంతకుమించిన సాక్ష్యం అవసరం లేదని మండిపడుతున్నారు.

**స్వాతంత్ర్యానికి పూర్వమే టైమ్స్ కవర్ పేజీపై గాంధీ**

భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించడానికి ముందే 'ది టైమ్ మ్యాగజైన్' కవర్ పేజీపై మూడుసార్లు గాంధీ మెరిసారని గుర్తుచేస్తున్నారు. ఈ గెలాక్సీ మొత్తానికి ఆయన తెలుసని, ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్, మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్, నెల్సన్ మండేలా వంటివారు ఆయన నుంచి స్ఫూర్తి పొందారని చెప్తున్నారు.

**సినిమాకు ముందే పలు దేశాల్లో స్టాంపులు**

అటెన్‌బరో సినిమా రావడానికి ముందే ఎన్నో దేశాలు ఆయన విగ్రహాలను ప్రతిష్ఠించాయని, ఆయన పేరుపై స్టాంపులు కూడా విడుదల చేశాయని పేర్కొంటూ పోస్టులు, ఫొటోలు పెడుతున్నారు. ఆ సినిమా కూడా నేషనల్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిధులతో రూపొందిందని పేర్కొంటున్నారు.

# రైతులకు శుభవార్త..

# 5 రోజుల్లో అకౌంట్‌లోకి డబ్బులు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. జూన్ ఒకటో తేదీన జరిగే ఎన్నికలతో చివరి విడత ముగుస్తుంది. నాలుగో తేదీన ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఫలితాలు వచ్చిన తర్వాత ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా రైతులకు, వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందనుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 16వ విడత డబ్బులను రైతుల ఖాతాల్లో వేశారు. ప్రస్తుతం 17వ విడత డబ్బులు రావాల్సి ఉంది.

**16వ విడతలో రూ. 21వేల కోట్లు**


లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చిన నాలుగైదు రోజులకే రైతులకు నిధులు విడుదల కానున్నాయి. 16వ విడతలో రైతులకు రూ.21వేల కోట్ల లబ్ధి కలిగింది. ప్రధానమంత్రి కిసాన్ పథకాన్ని నరేంద్రమోడీ ప్రారంభించారు. ఈ పథకం కింద లబ్ధిదారులు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ.2వేలు అందుకుంటారు. పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి రూ.6వేలు అందుతాయి. దేశవ్యాప్తంగా ఉన్న అన్నదాతలు వీటిని పొలంలో పంట వేసేందుకు అవసరమైన విత్తనాలు, తదితరాల కొనుగోలుకు ఉపయోగించుకోవాలి.



## వారి ఓట్లు పడలేదని వైసీపీకి అర్ధమైందా?

**విజయవాడ బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్**

ఢీ అంటే ఢీ అన్నట్లుగా అల్లర్లు, గొడవలు, దాడుల మధ్య జరిగిన ఏపీ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలు ముగిశాయి. వచ్చేనెల నాలుగోతేదీన ఫలితాలు విడుదల కాబోతున్నాయి. ఈలోగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమి ఎవరికి వారుగా ఎవరెవరికి ఎన్ని సీట్లు వస్తాయి? ఏ నియోజకవర్గాల్లో గెలుపొందే అవకాశం ఉంది? ప్రత్యర్థి పార్టీకి ఎక్కడ ప్లస్ లు ఉన్నాయి? ఎక్కడ మైనస్ లు ఉన్నాయి? తమకు ప్లస్ లు, మైనస్ లు ఎక్కడ? అనే అంచనాల్లో మునిగిపోయాయి. ఏ పార్టీకాపార్టీ తమ శ్రేణులకు తామే అధికారంలోకి వస్తామని చెబుతూ వారిలో ఆత్మవిశ్వాసం సడలకుండా చూసుకుంటున్నాయి. ఎవరెవరు అండగా నిలిచారంటే.. ఏయే వర్గాలు ఏ పార్టీకి అండగా నిలిచారు అన్న అంశంపై అన్ని పార్టీలు ఓ అవగాహనకు వస్తున్నాయి. అయితే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తమకు పడలేదన్న అంచనాకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వచ్చింది. పోస్టల్ బ్యాలెట్లలో ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారు. ప్రభుత్వంపై ఐదు సంవత్సరాల నుంచి ఉద్యోగులు పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వం కూడా తమను వేధింపులకు గురిచేసిందనే అభిప్రాయంలో వారంతా ఉన్నారు. దీంతో సహజంగానే వీరంతా ప్రతిపక్షానికి ఓటు వేసివుంటారని వైసీపీ అంచనాకు వచ్చింది. ఏపీలో పోస్టల్ బ్యాలెట్ల ఓట్లకు సంబంధించి కొన్ని కొన్ని ప్రాంతాల్లో రిటర్నింగ్ అధికారులు తమ సీల్ వేయలేదు. దీంతో ఇవి చెల్లుతాయా? చెల్లవా? అనే ఆందోళనలో ఉద్యోగులున్నారు. దీనిపై ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. సీల్ లేని కారణంగా ఓట్లు మురిగిపోకూడదన్న ఉద్దేశంతో ఉన్న ఈసీ అవి చెల్లుతాయని ప్రకటించింది. అయితే అలాంటి నిర్ణయం ఎలా తీసుకుంటారంటూ వైసీపీ ఈసీని ప్రశ్నించింది. కచ్చితంగా రిటర్నింగ్ అధికారి ముద్ర ఉండాలని, సంతకం ఉండాలని, లేదంటే వాటిని చెల్లని ఓట్లుగా పరిగణించాలని ఈసీపై ఒత్తిడి తెస్తోంది.




## హిందూపురం పోల్ డేటా విడుదల చేసిన ఏపీ సీఈవో కార్యాలయం

**ఏపీలో మే 13న పోలింగ్**

**లోక్ సభ నియోజకవర్గాల వారీగా పోల్ డేటా విడుదల చేస్తున్న సీఈవో కార్యాలయం**

**హిందూపురం లోక్ సభ స్థానం పరిధిలో 84.70 శాతం పోలింగ్**

**అత్యధికంగా ధర్మవరం అసెంబ్లీ స్థానంలో 88.83 శాతం పోలింగ్**

**అత్యల్పంగా హిందూపురం అసెంబ్లీ స్థానం పరిధిలో 77.82 శాతం పోలింగ్**

ఏపీలో మే 13న పోలింగ్ జరిగిన నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నేడు హిందపూరం పార్లమెంటరీ స్థానం పోల్ డేటాను విడుదల చేసింది. హిందూపురం లోక్ సభ నియోజకవర్గం మొత్తమ్మీద 84.70 శాతం పోలింగ్ నమోదైనట్టు వెల్లడించింది. హిందూపూరం ఎంపీ స్థానం పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 16,56,775 కాగా... 14,03,259 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తెలిపింది. వారిలో పురుష ఓటర్ల శాతం 85.46, మహిళా ఓటర్ల శాతం 83.94, ట్రాన్స్ జెండర్ ఓటర్ల శాతం 47.36 అని సీఈవో కార్యాలయం వివరించింది. ఇక, హిందూపురం లోక్ సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజవకర్గాల్లో నమోదైన పోలింగ్ వివరాలను కూడా సీఈవో కార్యాలయం పంచుకుంది. అత్యధికంగా ధర్మవరం అసెంబ్లీ స్థానంలో 88.83 శాతం పోలింగ్ నమోదు కాగా... అత్యల్పంగా హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 77.82 శాతం ఓటింగ్ నమోదైంది. మడకశిర అసెంబ్లీ నియోజకవర్గంలో 87.45, పెనుకొండలో 86.96, పుట్టపర్తిలో 86.27, రాప్తాడులో 85.09, కదిరిలో 81.37 శాతం పోలింగ్ నమోదైనట్టు సీఈవో కార్యాలయం పేర్కొంది.

## సజ్జలను వెంటనే అరెస్ట్ చేయాలి: దేవినేని ఉమా

**విజయవాడ, జర్నలిస్ట్ ఫైల్:** రూల్స్ పాటించే వాళ్లు కౌంటింగ్ సందర్భంగా వైసీపీ ఏజెంట్లుగా కూర్చోవద్దని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెబుతున్నారని టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా ఆరోపించారు. ప్రభుత్వం నుంచి లక్షల రూపాయలు జీతం తీసుకుంటున్న సజ్జల ఇలాంటి సలహాలు ఇస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చట్ట వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్న సజ్జలపై క్రిమినల్ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించేవాళ్లు ఎన్నికల ఏజెంట్లుగా వెళ్లొద్దని చెబుతున్నాడని... కూటమి పార్టీల ఏజెంట్లపై గొడవలకు దిగే వాళ్లే కౌంటింగ్ కు వెళ్లాలని సజ్జల సూచిస్తున్నట్టుగా ఉందని ఉమా విమర్శించారు. మనమేమీ రూల్స్ ను పాటించడం కోసం కౌంటింగ్ హాల్లోకి వెళ్లడం లేదని సజ్జల చెప్పడం దేనికి నిదర్శనం అని ప్రశ్నించారు. సజ్జల వ్యాఖ్యలు చూస్తుంటే, అతడికి చట్టంపై, ఈసీ నిబంధనలపై ఎంత గౌరవం ఉందో అర్థమవుతోందని దేవినేని ఉమా వ్యాఖ్యానించారు.

# ఎవరు ఓడినా.. ఎవరు గెలిచినా..


## తేల్చేసిన ఓటర్లు

**అమరావతి బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్**

ఏపీ ఫలితం ఎన్నో సమస్యలకు పరిష్కారం ఇస్తోంది. ఏపీలో రాజధాని వ్యవహారం దాదాపు అయిదేళ్ల కాలంగా వివాదంగా మారింది. న్యాయస్థానం పరిధిలో ఉంది. విశాఖ పరిపాలనా రాజధాని నినాదంతో వైసీపీ ముందుకు వెళ్లింది. ఎన్డీఏ కూటమిలోని మూడు పార్టీలతో పాటుగా కాంగ్రెస్ సైతం అమరావతికి జై కొట్టింది. కానీ, ఓటర్లు ఏం తీర్పు ఇచ్చారు. ప్రత్యేకంగా ఉత్తరాంధ్ర.. అమరావతి పరిధిలో ఏ పార్టీకి ప్రజలు మొగ్గు చూపారు.. ఆ తీర్పే రాజధాని పైన ప్రజాభిప్రాయంగా చర్చ జరుగుతోంది. ఏపీ రాజధాని పై క్లారిటీ ఏపీ రాజధానిగా అమరావతి కొనసాగతుందా. జగన్ చెప్పిన విధంగా మూడు రాజధానులే ఏపీ ప్రజలు కోరుకుంటున్నారా. జూన్ 4న వెల్లడి కానున్న ఫలితాల్లో ఏపీలో అధికారంతో పాటుగా రాజధాని అంశం పైన స్పష్టత రానుంది. సీఎం జగన్. మళ్లీ గెలుస్తున్నాం.. విశాఖలోనే ప్రమాణం చేస్తా... విశాఖ నుంచే పాలన కొనసాగిస్తా అని ధీమాగా చెప్పుకొచ్చారు. చంద్రబాబు గెలుస్తున్నారు.. అమరావతిలో ప్రమాణ స్వీకారం ఉంటుందని టీడీపీ నేతలు చెబుతున్నారు. విశాఖలో జగన్ జూన్ 9న ప్రమాణ స్వీకారం చేస్తారంటూ ముహూర్తం సైతం ప్రకటించారు.

**ప్రజలు తీర్పు ఇచ్చినట్లేనా**

అమరావతిని శాసన రాజధానిగా కొనసాగిస్తూ విశాఖను పరిపాలన రాజధానిగా.. కర్నూలును న్యాయ రాజధానిగా చేస్తామని జగన్ ప్రకటించారు. ప్రస్తుతం ఈ వివాదం సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. ప్రతిపక్షాలు అమరావతి మాత్రమే రాజధానిగా ఉండాలంటూ నినదించారు.






దీంతో.. ఈ సారి ఎన్నికల్లో రాజధాని వ్యవహారం అమరావత్సి వర్సెస్ విశాఖగా మారింది. ఎన్నికల ముందే ఎవరి స్టాండ్ ఏంటో క్లియర్ కట్‌గా ప్రజల ముందు పెట్టారు. దీంతో ఎన్నికల్లో వచ్చే తీర్పు రాజధానిపై రెఫరెండంగా చర్చ జరుగుతోంది. విశాఖ నగరంతో పాటుగా ఉత్తరాంధ్ర.. అదే విధంగా అమరావతి పరిధిలోని రెండు జిల్లాల్లో ఏ పార్టీకి ప్రజలు పట్టం కట్టారనే దానికి అనుగుణంగా రాజధాని పైన ప్రజల మూడ్ పై క్లారిటీ వచ్చే అవకాశం కనిపిస్తోంది.

**కొత్త ప్రభుత్వం నిర్ణయం ఇక..**

ఫలితాల తరువాత కొత్త ప్రభుత్వం రాజధాని పైన కీలక నిర్ణయం తీసుకొనే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి మద్దతిచ్చి గెలిపిస్తే.. మూడు రాజధానుల పై జగన్ ముందుకు వెళ్లవచ్చని గతంలో టీడీపీ ముఖ్య నేతలు సవాల్ చేసారు. ఇప్పుడు రాజధాని పైన పార్టీల స్టాండ్ స్పష్టం అయిన తరువాత పోలింగ్ జరిగింది. ఇక... వచ్చే తీర్పుకు అనుగుణంగా సుప్రీంలో కేసు విషయంలో కొత్త ప్రభుత్వం కీలక అడుగులు వేసే అవకాశం కనిపిస్తోంది. అయితే, జగన్ కు పట్టం కడితే కోర్టు తుది తీర్పు వచ్చే వం–కూ విశాఖ కేంద్రంగా సీఎం పాలన చేసే అవకాశం ఉంది. కూటమి గెలిస్తే సుప్రీంలో ప్రభుత్వం చేసిన అప్పీల్ పైన నిర్ణయంతో పాటుగా.. అమరావతిని కొనసాగించే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. దీంతో.. ఎన్నికల ఫలితంతో రాజధాని అంశం తేలే ఛాన్స్ కనిపిస్తోంది.



## గెలిచేది మనమే.. కౌంటింగ్ రోజు కూల్..

**జనసైనికులకు నాగబాబు కీలక సూచన..!**

**విజయవాడ , జర్నలిస్ట్ ఫైల్:** కౌంటింగ్ రోజు జనసైనికులు ఎలా ఉండాలన్న దానిపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ఓ వీడియో రిలీజ్ చేశారు. ఇవాళ రిలీజ్ చేసిన వీడియోలో నాగబాబు.. జనసైనికులకు, వీర మహిళలకు, నాయకులకు, పిఠాపురం జనసేన నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి విజయానికి చేరువలో ఉందని నాగబాబు తెలిపారు. వైసీపీ పరాజయం అంచుల్లో ఉందన్నారు. ఎప్పుడైతే ఏ మనిషైనా ఓడిపోతాడని తెలిస్తే ఫ్రస్టేషన్ ఉంటుందని, హింసకు, గొడవలకు సిద్ధమవుతుంటారని నాగబాబు తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో సంయమనం పాటించి పోలీసులు, ఈసీకి సహకరిద్దామని నాగబాబు పార్టీ శ్రేణులు, నేతలకు విజ్ఞప్తి చేశారు. వైసీపీ కవ్వింపు చర్యలకు ప్రతిస్పదించొద్దని వారిని కోరారు. ఏమీ లేని ఆకు ఎగిరెగిరి పడుతుందని, అన్నీ ఉన్న ఆకు అణిగిమణిగి ఉంటుందని గుర్తుచేశారు. అంతా సైలెంట్ గానే ఉందాం, ప్రజాస్వామ్యాన్ని గౌరవిద్దాం, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఏమీ చేయొద్దన్నారు. పోలీసులు, ఈసీకి సహకరిద్దాం, ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెడదామంటూ నాగబాబు పిలుపునిచ్చారు. రాబోయేది కూటమి ప్రభుత్వమే, ఓడిపోయే వాళ్లు చేసే కవ్వింపు చర్యలకు, అల్లర్లకు ప్రతిస్పందించవద్దన్నారు.

# దుర్గమ్మ గుడికి వారాంతంలో ఉచిత బస్సులు

**విజయవాడ, జర్నలిస్ట్ ఫైల్**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి భక్తులకు పోటెత్తుతున్నారు. వేసవి సెలవులు కావడంతో అక్కడ రద్దీ నెలకొంది. ఇదిలా ఉండగా, దుర్గమ్మ దర్శనానికి వెళ్లే భక్తులకు ఆలయ అధికారులు శుభవార్త చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులు కొండపైకి చేరుకోనేందుకు వీకెండ్‌లో బస్సులు ఏర్పాటు చేస్తోంది. ఈ బస్సుల్ని శుక్ర, శని, ఆదివారాల్లో ఉచితంగా నడపాలని ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గతవారం రోజుల్లో కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. సమ్మర్ హాలీడేస్, వీకెండ్ నేపథ్యంలో ఈ రద్దీ ఉందని అధికారులు భావిస్తున్నారు. అయితే, అమ్మవారికి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా పలు ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. ఇంద్రకీలాద్రిపైకి వచ్చే భక్తుల కోసం దేవస్థానానికి చెందిన బస్సులు మొత్తం 12 ఉన్నాయి. అయితే అందులో 8 బస్సులను కేవలం భక్తులకోసం ఉచితంగా ఆలయానికి చేరవేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇక, వీటి పార్కింగ్ ప్రదేశాల కోసం అధికారులు పరిశీలిస్తున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంతో పాటుగా పున్నమిఘాట్, వినాయకుడి గుడి ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రదేశాలను అధికారులు పరిశీలించడం జరిగింది. భక్తులు కొండపైకి అమ్మవారి దర్శనం కోసం వెళ్లేందుకు పున్నమిఘాట్ నుంచి రెండు బస్సులను నడపాలని అధికారులు ఆలోచిస్తున్నారు. వీటితోపాటు భక్తుల సౌకర్యార్థం మోడల్ గెస్ట్ హౌస్ నుంచి నాలుగు బస్సులు, వీఎంసీ ఎదురు పార్కింగ్ వద్ద నుంచి

**శుక్ర, శని, ఆదివారాల్లో నడిపించాలని నిర్ణయం**



రెండు బస్సులు ఉచితంగా ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిత్యం దేవస్థానం సిబ్బందితో పాటు పోలీసులు కూడా అందుబాటులో ఉండనున్నారు.

**కొండపై ట్రాఫిక్ నియంత్రణ..**

అంతేకాదు, వీకెండ్‌లో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల వాహనాల రద్దీని బట్టి కొండపైకి పరిమిత సంఖ్యలో వాహనాలను అనుమతించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దుర్గమ్మ కొండపై ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కొండపై ఉన్న టర్నింగ్ దగ్గర ఉన్న పార్కింగ్ ఏరియాలో 150 వరకు కార్లు, బైకులకు మాత్రమే అనుమతి ఉంది. కాబట్టి వాహనాలను కిందనే పార్కింగ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు.



## ఏబీవీకి హైకోర్టులో భారీ ఊరట

**విజయవాడ,జర్నలిస్ట్ ఫైల్:** ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావుకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. క్యాట్ (కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్) ఉత్తర్వులను సస్పెండ్ చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. వెంకటేశ్వరరావుపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఇటీవల క్యాట్ ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వులను నిలిపివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. క్యాట్ ఉత్తర్వులను నిలుపుదల చేసేందుకు నిరాకరించింది.

# టీడీపీకి వచ్చే సీట్లపై బాబు క్లారిటీ

**అమరావతి, జర్నలిస్ట్ ఫైల్**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమి మధ్య హోరాహోరీగా జరిగిన ఎన్నికల సమరం ముగిసింది. జూన్ నాలుగో తేదీన ఫలితాలు వెల్లడి కానున్నాయి. పోటీచేసిన అభ్యర్థులతోపాటు ప్రజలు కూడా అత్యంత ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఒకటోతేదీన జాతీయ మీడియా సంస్థలు ఎగ్జిట్ పోల్స్ వెల్లడిస్తున్నాయి. వాటినిబట్టి ఏ ప్రభుత్వం వస్తుందనే అంచనాకు రావచ్చు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు విదేశీ పర్యటన ముగించుకొని తిరిగి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? అనే విషయాన్ని అంచనా వేశారు. 35 కూడా వచ్చే పరిస్థితి లేదు పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలిస్తే వైసీపీకి కనీసం 35 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని చంద్రబాబు అభిప్రాయపడుతున్నారు. తెలుగుదేశం పార్టీకి జనసేనాని పవన్ కల్యాణ్ మాటకు కట్టుబడి సహకారం అందించారని, దాదాపుగా మెజారిటీ సీట్లలో జనసేన గెలవబోతోందని పార్టీ నాయకులతో అన్నట్లు తెలిసింది. వైసీపీ ఎన్నిరకాల ప్రయత్నాలు చేసినా తెలుగుదేశం శ్రేణులు కలిసికట్టుగా ఎదిరించారని, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అధికార పార్టీ అరాచకాలను ధీటుగా ఎదుర్కొన్నారన్నారు. అందుకు మాచర్ల, తాడిపత్రి సంఘటనలను ఉదహరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పోలింగ్ సరళిని పరిశీలిస్తే వార్ వన్ సైడ్ గానే జరిగిందని, ప్రజలంతా గుంభనంగా వ్యవహరించారని, వారు అలా వ్యవహరించడానికి కూడా కారణం ఉందన్నారు. ఫలానా పార్టీకి ఓటు వేశామని చెబితే ప్రత్యర్థి పార్టీ నుంచి కేసుల గొడవలు, ఇతరత్రా అల్లర్లు జరగడానికి అవకాశం ఉంటుందని భావించి వీరంతా ఓటు ఎవరికి వేశామనే విషయాన్ని బహిరంగపరచడంలేదని విశ్లేషిస్తున్నారు. మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమి 120 సీట్లకు పైగా



గెలుపొందుతుందని అంచనా వేస్తున్నారు. నాలుగోతేదీన ఫలితాలు వస్తేకానీ వీరి అంచనాలు సరైనవా? కావా? అనేది తెలుతుంది. అప్పటివరకు ఎదురుచూడటమే.

**చంద్రబాబుతో వర్మ భేటీ**

ఏపీలో ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో అత్యంత ఉత్కంఠ రేపిన నియోజకవర్గాల్లో పిఠాపురం కూడా ఒకటి. గత ఎన్నికల్లో రెండు చోట్ల ఓటమిపాలైన పవన్ కళ్యాణ్ తొలిసారి పిఠాపురం నుంచి బరిలోకి దిగడమే ఇందుకు కారణం. అయితే పవన్ ఎన్నికను తన భుజాలపై వేసుకుని, అంతా తానై వ్యవహరించిన టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ తాజాగా విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన చంద్రబాబుతో భేటీ అయ్యారు. పిఠాపురంలో ఏం జరిగిందో ఆయనకు వివరించారు.

చంద్రబాబును హైదరాబాద్ నివాసంలో కలుసుకున్న ఎస్వీఎస్ఎన్ వర్మ .. పిఠాపురం ఎన్నికలు జరిగిన తీరును వివరించారు. స్థానికంగా పవన్ కళ్యాణ్ కు తాము అందించిన మద్దతు గురించి తెలిపారు. అలాగే పవన్ కు అనుకూలంగా పిఠాపురంలో జరిగిన పోలింగ్, ఆయన మెజార్టీపై కూడా వివరణ ఇచ్చారు. పవన్ గెలుపుకు దోహదం చేయబోతున్న అంశాల్ని కూడా చంద్రబాబుకు వర్మ వివరించినట్లు తెలుస్తోంది. అలాగే టీడీపీ శ్రేణులు పవన్ కు మద్దతుగా ఓట్ల బదిలీ కోసం ఎలా పనిచేశాయన్నదీ వివరించారు. అనంతరం దీనిపై వర్మ ఓ ట్వీట్ కూడా చేశారు. రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ అత్యధిక మెజార్టీతో గెలువబోతున్నారని చంద్రబాబుకు వివరించినట్లు వర్మ ట్వీట్ లో పేర్కొన్నారు. దీంతో ఆయన ట్వీట్ కు స్పందనగా జనసేన క్యాడర్ కూడా తాము రాష్ట్రంలో అదే విధంగా టీడీపీ విజయం కోసం పనిచేసినట్లు ట్వీట్లు పెడుతున్నారు. మరికొందరు వర్మ త్యాగాన్ని అభినందిస్తున్నారు. మరోవైపు పిఠాపురంలో పవన్ కు 50 వేలకు పైగా మెజార్టీ వస్తుందని జనసేన, టీడీపీ నేతలు ఇప్పటికే అంచనా వేసుకుంటున్నారు.




## పోస్టల్ బ్యాలెట్ నిబంధనపై హైకోర్టుకు వైసీపీ

- ఏపీలో పోస్టల్ బ్యాలెట్ రగడ
- ఆర్వో సీల్ లేకపోయినా పోస్టల్ బ్యాలెట్లు చెల్లుతాయన్న సీఈవో మీనా
- ఈ నిబంధన సమంజసం కాదంటున్న వైసీపీ
- ఏపీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్

**విజయవాడ :** రిటర్నింగ్ అధికారి సీల్ (స్టాంపు) లేకపోయినా సంతకం ఉంటే చాలని, అలాంటి పోస్టల్ బ్యాలెట్లను తిరస్కరించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన మార్గదర్శకాలను ఏపీ ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు పంపించిన సంగతి తెలిసిందే.

అయితే ఈ నిబంధనను అధికార వైసీపీ వ్యతిరేకిస్తోంది. పోస్టల్ బ్యాలెట్ నిబంధనపై వైసీపీ ఏపీ హైకోర్టును ఆశ్రయించింది.

బ్యాలెట్ పై ఆర్వో సీల్ లేకపోయినా ఓటును తిరస్కరించవద్దంటూ సీఈవో ముఖేశ్ కుమార్ మీనా ఇచ్చిన మెమో సమంజసం కాదని వైసీపీ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ ను అత్యవసరంగా విచారించేందుకు హైకోర్టు అంగీకారం తెలిపింది.

జర్నలిస్ట్ ఫైల్

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా..
సంప్రదించండి - 7661805968

అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు...
సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467